పెన్ పవర్ ప్రకాశం

అయ్యలూరివారిపల్లెలో నేటి నుంచి

# పోలేరమ్మ తల్లి తిరుణాళ్ళ

**చంద్రశేఖరపురం, పెన్ పవర్ మే 29**

చంద్రశేఖరపురం మండలంలోని అయ్యలూరివారిపల్లి గ్రామంలో వెలసిన పోలేరమ్మ తల్లి తిరుణాళ్ళ వేడుకలు నేటి నుండి ఒకటవ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు ఈ సందర్భంగా ఉదయము 8 గంటలకు గణపతి పూజ, సాయంత్రం 4 గంటలకు ఆదిత్యాది నవగ్రహ మండపారాధన , దుర్గా సూక్తి హోమం, భక్తులు విశేష పూజా కార్యక్రమాలు తదుపరి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేస్తారు తదుపరి రాత్రికి చిన్న కప్పలపల్లి గ్రామమునకు చెందిన శ్రీ పోలేరమ్మ తల్లి కోలాట బృందం వారిచే కోలాటం నిర్వహించుచున్నామని తెలిపారు. అమ్మవారికి పంచామృత అభిషేకం పుష్పాభిషేకం 31న ఉదయము 8 గంటలకు 101 బిందెలతో అమ్మవారికి అభిషేకం నిర్వహించి పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు సాయంత్రం4 గంటలకు కుంకుమార్చన కార్యక్రమం, శ్రీ సూక్త హోమం, రాత్రికి భరతనాట్యం కార్యక్రమం, జూన్ 1న పూర్ణహుతి పొంగళ్ళతో తెరునాళ్ల ముగింపు ఉంటుందని తెలిపారు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించి జయప్రదం చేయాలని కోరారు.

## వినియోగదారులకు

# రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి

**ఎలాంటి అవినీతి అక్రమాలకు పాల్పడిన కఠిన చర్యలు తప్పవు.**

**ప్రతి నెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు తప్పనిసరిగా షాపులు తెరిచి ఉంచాలి .**

**వినియోగదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చాలి.**

**చౌక ధరల దుకాణ అధికారులు సమావేశంలో తాసిల్దార్ భాగ్యలక్ష్మి సూచనలు సలహాలు.**





**కొమరోలు పెన్ పవర్ మే 29.**

రేషన్ షాపులో డీలర్లు కార్డుదారులకు సక్రమంగా నిత్యవసర వస్తువులు పంపిణీ చేస్తూ ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చాలని కొమరోలు తాసిల్దార్ దేవరశెట్టి భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. జూన్ ఒకటవ తేదీ నుంచి వినియోగదారులకు రేషన్ పంపిణీ చేసే విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నది .అందులో భాగంగా చౌక ధర దుకాణ డీలర్లకు సలహాలు సూచనలు ఇచ్చేందుకు గురువారం కొమరోలు తాసిల్దార్ కార్యాలయంలో డీలర్లు, వీఆర్వోల తో సమావేశం నిర్వహించారు. ఆ సమావేశానికి తాసిల్దార్ భాగ్యలక్ష్మి అధ్యక్షత వహించగా, గిద్దలూరు ఇన్ఫోసిమెంట్ డ్యూటీ రామనారాయణరెడ్డి ఫుడ్ ఇన్స్పెక్టర్ సల్మాన్ డిప్యూటీ తాసిల్దార్ వెంకటయ్య పాల్గొన్నారు.ఆ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ ఎండియు ఆపరేటర్ల ద్వారా పంపిణీ జరుగుతున్న రేషన్ బియ్యం లో అవినీతి అక్రమాలు జరుగుతున్నట్లుగా ప్రభుత్వ దృష్టికి రావడంతో రాష్ట్ర ప్రభుత్వం ఎండియు వాహనాలను రద్దుచేసి జూన్ 1వ తేదీ నుంచి రేషన్ షాపుల ద్వారా నిత్యవసర వస్తువులు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నదని ఆమె చెప్పారు. అందువల్ల డీలర్లు వినియోగదారులకు సక్రమంగా రేషన్ పంపిణీ చేయాలని, ఎలాంటి అవినీతి అక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలకు బాధ్యులు కావలసి ఉంటుందని ఆమె హెచ్చరించారు. ప్రతి నెల 31వ తేదీల్లోగా నిత్యవసర వస్తువులు షాపులకు చేరవేస్తారని ,డీలర్లు ప్రతినెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు షాపులను తెరిచి ఉంచి నిత్యవసర వస్తువులు పంపిణీ చేయాలన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలకు, సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు తప్పనిసరిగా డీలర్లు షాపులలో ఉండి నిత్యవసర వస్తువులు పంపిణీ చేయాలని ఆమె కోరారు .గ్రామ పరిస్థితిని బట్టి ఉదయం 6 గంటల నుంచి కూడా నిత్యవసర వస్తువులు పంపిణీ చేయవచ్చని ,అంతేకాక రాత్రి 8 గంటల తర్వాత కూడా నిత్యవసర వస్తువులు అందించవచ్చని ఆమె వివరించారు .ఏదైనా కుటుంబంలోని సభ్యులలో ఒక్కరు కూడా రేషన్ షాపుకు రాలేని పరిస్థితులు ఏర్పడినప్పుడు అలాంటి కుటుంబాలలోని వృద్ధులు వికలాంగులకు డీలర్లు మధ్యాహ్నం 12 గంటల నుంచి వారి సంబంధించిన రేషను ఇంటింటికి పంపిణీ చేయాలన్నారు. రేషన్ కార్డు కలిగిన వినియోదారుడు రాష్ట్రంలోని ఏ రేషన్ షాపు నుంచి అయినా నిత్యవసర వస్తువులు పొందే హక్కు కలిగి ఉంటాడని, అందువల్ల రేషన్ కార్డుతో వచ్చిన వినియోగదారునికి ప్రాంతీయ బేధాలు చూపెట్టక తప్పనిసరిగా నిత్యవసర వస్తువులు పంపిణీ చేయాలని ఆమె ఆదేశించారు. రేషన్ షాపుల ముందు రేషన్ షాపుకు సంబంధించిన బోర్డును ఏర్పాటు చేయాలని, రేషన్ షాపు లోపల ధరల పట్టికను తప్పనిసరిగా డిస్ప్లే చేయాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారమే రేషన్ పంపిణీ చేయాలని ,చిల్లర కు చూపి అధిక ధరను వసూలు చేయడం, లేదా తూకాలలో వ్యత్యాసాలు ప్రదర్శించడం లాంటి చర్యలకు పాల్పడవద్దని ఆమె హెచ్చరించారు. ప్రతి నెల తనతో పాటు ఎన్ఫోర్స్మెంట్ డీటీ ,ఫుడ్ ఇన్స్పెక్టర్ ,విఆర్ఓ తదితర అధికారులు రేషన్ షాపులను తనిఖీ చేస్తారని ,అధికారుల తనిఖీల్లో ఎలాంటి అక్రమాలు అవినీతి బయటపడిన డీలర్ పై శాఖ పరమైన చర్యలు తీసుకుంటారని ఆమె హెచ్చరించారు. ఎలక్ట్రికల్ కాటాను ఈ పాస్ మిషన్ ను 31వ తేదీ సాయంత్రానికి తనిఖీ చేసుకొని సిద్ధంగా ఉంచుకోవాలని ఆమె కోరారు. గిద్దలూరు ఎన్ఫోర్స్మెంట్ రామనారాయణరెడ్డి మాట్లాడుతూ రేషన్ షాప్ వద్దకు వచ్చే వినియోగదారులతో డీలర్లు మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారిని విసుక్కోవటం, వారిపై కోపాన్ని ప్రదర్శించటం లాంటి చర్యలకు పాల్పడవద్దని ,ఒకటవ తేదీ సాధారణంగా అధిక సంఖ్యలో వినియోగదారులు షాపుల వద్దకు వస్తారని అయితే వృద్ధులు, వికలాంగులకు కూర్చునే సౌకర్యం కల్పించడంతో పాటు తాగునీటి సౌకర్యం కూడా తప్పనిసరిగా కల్పించాలన్నారు. డీలర్లు తప్పనిసరిగా ఒకటవ తేదీ నుంచి 15 తేదీ వరకు షాపులలో ఉండాలని ,ఏదైనా అత్యవసర పరిస్థితులలో వెళ్ళవలసి వస్తే తాసిల్దారు ,వీఆర్వో ,ఫుడ్ ఇన్స్పెక్టర్ లలో ఎవరో ఒకరి సమాచారం అందించాలని ,అవసరం అయితే ముందస్తు అనుమతులు కూడా తీసుకోవాలని ఆయన సూచించారు .జూన్ 1వ తేదీన తప్పనిసరిగా షాపుల ముందు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. జూన్ 1వ తేదీన షాపుల ముందు పండుగ వాతావరణం కల్పించాలన్నారు. ఎండియు ఆపరేటర్ల ద్వారా అవినీతి అక్రమాలు జరుగుతున్నట్లుగా గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం తిరిగి డీలర్లకే నిత్యవసర వస్తువులు పంపిణీ చేసే అవకాశం కల్పించిందని ,అందువలన డీలర్లు నీతి నిజాయితీగా వ్యవహరిస్తూ ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చాలని ఆయన కోరారు .రేషన్ కార్డులో పేర్లు ఉన్న ఒక్కొక్క వినియోగదారునికి ఐదు కిలోల చొప్పున బియ్యం ఉచితంగా అందించాలని ,అంతేకాక అరకిలో పంచదార కూడా పంపిణీ చేయాలని ఆయన కోరారు. డిప్యూటీ తాసిల్దార్ వెంకటయ్య మాట్లాడుతూ వి ఆర్ ఓ గ్రామ మెజిస్ట్రేట్ అని ,అయితే రేషన్ షాపులకు తనిఖీ నిమిత్తం వచ్చే వీఆర్వోల పట్ల అనేకమంది డీలర్లు మర్యాదపూర్వకంగా వ్యవహరించడం లేదనే విమర్శలు వినవస్తున్నాయని, కావున డీలర్లు వీఆర్వోలకు తగిన గౌరవమిచ్చి వారి సూచనలు సలహాలు పొందాలని ఆయన సూచించారు. ఆ కార్యక్రమంలో గిద్దలూరు ఎన్ఫోర్స్మెంట్ డిటి రామనారాయణరెడ్డి ,ఫుడ్ ఇన్స్పెక్టర్ సల్మాన్ ,డిప్యూటీ తాసిల్దార్ వెంకటయ్య తోపాటు జూనియర్ అసిస్టెంట్లు పెద్ద దేవా నాయక్ ,రంగనాయకులు ,శ్రీవిద్య, డీలర్లు, వీఆర్వోలు ,వీఆర్ఏలు పాల్గొన్నారు.

# గ్రేడ్ 2 మున్సిపాల్టీగా గిద్దలూరు స్థాయి పెంపు

**ఫలించిన ఎమ్మెల్యే కృషి**





**గిద్దలూరు పెన్ పవర్ మే 29**

నగరపంచాయితీగా ఉన్న గిద్దలూరు ను గ్రేడ్ 2 మున్సిపాలిటీగా అప్ గ్రేడ్ చేస్తూ గురువారం నాడు పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి నోటిఫికేషన్ జారీచేశారు ఈ ఉత్తర్వులు వెంటనే అమల్లోకి వచ్చాయని అందులో పేర్కొన్నారు. గిద్దలూరు గ్రేడ్2మున్సిపాలిటీ గా స్థాయి పెంపు వెనుక ఎమ్మెల్యే అశోకరెడ్డి కృషి ఎంతో ఉంది. గిద్దలూరు నగర పంచాయతీ ని అప్ గ్రేడ్ చేయాలని గిద్దలూరు కౌన్సిల్ తీర్మానం 185ను 29 నవంబర్ 2024 లో స్వయంగా ఎమ్మెల్యే అశోకరెడ్డి కౌన్సిల్ సమావేశం లో పాల్గొని నగరపంచాయతీని అప్ గ్రేడ్ చేయాలని ప్రభుత్వానికి ఒక ప్రపోజల్ తీర్మానాన్ని కోన్సిల్ సభ్యులు ఆమోదించి పంపారు. దాంతో పాటు నగరపంచాయతీ అప్ గ్రేడ్ ఎందుకు చేయాలో వివరాలను, ఆదాయ , వ్యయాలను తెలిపారు. ఆతరువాత ఎమ్మెల్ అశోక్ రెడ్డి రాష్ట్ర పురపాలక శాఖ ,ప్రభుత్వం తో సంప్రదించి నగరపంచాయతీ ని గ్రేడ్ 2 మున్సిపల్ గా మార్పు చేయించారు. దీని వెనుక ఎమ్మెల్యే కృషి ప్రశంశనీయం.

# గిద్దలూరు నగర పంచాయతీకి రెండవ స్థాయి మున్సిపాలిటీ హోదా ఎమ్మెల్యే ముత్తుముల



**గిద్దలూరు పెన్ వర్ మే 29**

గిద్దలూరు ప్రజలకు ఇది గర్వించదగిన సమయం అని, సంవత్సరాలుగా ప్రజలు కోరుకుంటూ, నేను ఎన్నో మార్లు వేదికలపై నిలబడి హామీ ఇచ్చిన రెండవ స్థాయి మున్సిపాలిటీ (గ్రేడ్-2 మున్సిపాలిటీ) హోదా ఇప్పుడు సాకారమైందని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోకరెడ్డి పేర్కొన్నారు. 29 మే2025 న విడుదలైన జి ఓ 89 ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఈ ఉత్తర్వును జారీ చేసిందని గత రెండేళ్లుగా గిద్దలూరు పంచాయతీ ఆదాయ, వ్యయ వివరాలను సమీక్షించిన అనంతరం, మున్సిపల్ పరిపాలన శాఖ ఈ నిర్ణయం తీసుకుందని, ఇది మన అభివృద్ధికి గ్రీన్ సిగ్నల్ అని శాసన సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి తెలిపారు. ఈ హోదాతో వచ్చే ప్రయోజనాలు చాలా ఉన్నాయని, అందులో అభివృద్ధి నిధుల పెంపు, మెరుగైన మౌలిక వసతులు (రోడ్లు, డ్రైనేజ్, స్ట్రీట్ లైట్స్), మున్సిపల్ సిబ్బంది నియామకం, పారిశుద్ధ్య నిర్వహణలో మెరుగుదల, గృహ నిర్మాణ పథకాలకు ప్రాధాన్యం,పట్టణ ప్రణాళికలో సమగ్రత వుంటాయని, ఇది కేవలం ఒక హోదా మార్పు కాదని, ఇది మన పట్టణం అభివృద్ధి దిశగా వేసిన మైలురాయి అని పేర్కొన్నారు, గిద్దలూరును ఆధునిక పట్టణంగా తీర్చిదిద్దేందుకు ఇది ఒక శుభారంభం అని కొనియాడారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి నారాయణ కి, అధికారులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుచూ, మీరు నమ్మిన నాయకుడిగా, గిద్దలూరు నియోజక వర్గ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా మరింత కృషి చేస్తానని అశోకరెడ్డి పేర్కొన్నారు .

# మహానాడులో పాల్గొన్న సోమినేని





**కందుకూరు పెన్ పవర్, మే 29**

కడపలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మూడు రోజులు మహానాడు కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా నాయకులు సోమినేని రవీంద్ర పాల్గొన్నారు. మూడు రోజులు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు వెంట ఉన్నారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ 30 సంవత్సరాల నుండి తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడుగా చంద్రబాబు నాయుడు కొనసాగుతున్నారు అన్నారు. స్వర్గీయ ఎన్టీఆర్ ఆశయాలు కనుగుణంగా పార్టీని దిగ్విజయంగా ముందుకు తీసుకెళ్తున్నారని, పార్టీని బలోపేతం చేయడంతో పాటు కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ పార్టీని ముందుకు నడిపించే నాయకుడు చంద్రబాబు నాయుడు



మరోసారి జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైనందుకు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

# మహానాడు సభకు భారీగా తరలివెళ్ళిన తెలుగుదేశం పార్టీ గిద్దలూరు నియోజకవర్గ శ్రేణులు







**గిద్దలూరు పెన్ పవర్ మే 29**

గిద్దలూరు నియోజకవర్గానికి చెందిన తెలుగుదేశం పార్టీ శ్రేణులు, శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి పిలుపు మేరకు, అశోకరెడ్డి సోదరుడు, యువతలో ఆదర్శంగా నిలుస్తున్న ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో విశేష స్పందనతో కడప మహానాడు సభకు బయలుదేరారు.మహానాడు, టీడీపీ కార్యకర్తల గుండెచప్పుడు. ప్రజాస్వామ్య స్ఫూర్తికి ప్రతిరూపం. ఇలాంటి విశిష్ట సందర్భానికి గిద్దలూరు నియోజకవర్గం నుంచి వచ్చిన భారీ కాన్వాయ్ ఆకర్షణీయ అంశమైంది.50 బస్సులు, 150 కార్లు, ఇతర వాహనాలతో, వందలాది కార్యకర్తల కేరింతలు, టీడీపీ నినాదాలు మార్మోగాయి. గిద్దలూరు నియోజకవర్గం నుండి వచ్చిన ప్రతీ కార్యకర్త ముఖంలో ఆత్మవిశ్వాసం, పార్టీ పట్ల నిబద్ధత వెల్లివిరిసింది. వీరి సంకల్పం తారస్థాయికి చేరిందని చెప్పడం అతిశయోక్తి కాదు. ఈ సందర్భంగా శ్రీ కృష్ణ కిషోర్ రెడ్డి మాట్లాడుతూ , తెలుగుదేశం పార్టీ , చంద్రబాబు నాయుడు నాయకత్వం అవసరం ప్రజలకు స్పష్టమైందని, ఈ మహానాడు సభలో పాల్గొనడం ద్వారా మనం పార్టీకి మద్దతు చూపడమే కాకుండా, ప్రజల ఆశయాలను ప్రతిబింబిస్తున్నాయని, పార్టీ కోసం ప్రతి కార్యకర్త పోరాట యోధుడిగా మారారని పేర్కొన్నారు .రాష్ట్ర అభివృద్ధి, అభిప్రాయ స్వేచ్ఛ, ప్రజా సంక్షేమమే తెలుగుదేశం లక్ష్యమని స్పష్టం చేశారు. ఈకార్యక్రమానికి కృష్ణకిశోర్ రెడ్డి పచ్చ జండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని మండల నాయకులు, కార్పొరేటర్లు, సర్పంచ్‌లు, యువనాయకులు, మహిళా నాయకులు, పెద్దఎత్తున తరలివెళ్ళారు.

## గిద్దలూరులో రేషన్ దుకాణాలను తనిఖీ చేసిన సివిల్ సప్లై డిప్యూటీ తాసిల్దార్ రామ్ నారాయణరెడ్డి



**గిద్దలూరు పెన్ పవర్ మే 29**

పలు రేషన్ షాపులను సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ రాం నారాయణ రెడ్డి తనిఖీ చేశారు. షాపుల్లో నిల్వలు సరిగాఉన్నాయా, తూనికలు ఎలా ఉన్నాయి రేషన్ షాప్ ముందు బోర్డు ఉందా అని విషయాలను పరిశీలించారు. జూన్ 1 నుండి ఎండియూ వాహనాలను తొలగించి రేషన్ షాపు డీలర్లే రేషన్ పంపిణీ చేస్తున్న నేపథ్యంలో రేషన్ షాప్ లను తనిఖీ చేశారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు జూన్ 1వ తేదీ నుండి రేషన్ సరుకులను స్థానిక రేషన్ షాపుల వద్ద పంపిణీ చేయాలని ఉత్తర్వులను జారీ చేయడం జరిగింది. ప్రభుత్వ ఉత్తర్వులు జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం తహసిల్దార్ ఆంజనేయ రెడ్డి పట్టణంలో 15 ప్రాంతాలకు గాను 15 రేషన్ దుకాణాలు ఉన్నాయని లబ్ధిదారులు తమ తమ పరిధిలో ఉన్న రేషన్ దుకాణాలకు వెళ్లి ప్రతి నెల 1వ తేదీ నుండి 15వ తేదీ వరకు రేషన్ సరుకులను తీసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో రంగయ్య, ఖాసిం వలి పాల్గొన్నారు.

## ఆముదాల పల్లిలో వికసిత్ కృషి సంకల్ప అభి మాన్





**పొదిలి, పెన్ పవర్, మే 29**

మండలంలోని ఆముదాలపల్లి గ్రామంలో గురువారం నాడు కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభి మాన్ కార్యక్రమం జరిగింది ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు మాట్లాడుతూ రైతులు ఖర్చులు తగ్గించుకొని వ్యవసాయం చేయడం ద్వారా అధిక ఆదాయం పొందాలన్నదే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని చెప్పారు రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు సూచనలను పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించుకొని, ద్వారా ఆర్థికంగా ఎదగాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఆత్మ పిడి విజయనిర్మల, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి శేషమ్మ, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త తూము వెంకటేశ్వర రెడ్డి, నూనె గింజల పరిశోధన సంస్థ శాస్త్రవేత్త ప్రద్దుమ్య యాదవ్, ఏపీ సీడ్స్ మేనేజర్ బుచ్చమ్మ, మండల వ్యవసాయ అధికారి షేక్ జైనులాబ్దిన్, మండల ఉద్యానవన అధికారి డి సంధ్య, పకృతి వ్యవసాయం డిపిఎం సుభాషిని, ఆముదాల పల్లి సర్పంచ్ శ్రీనివాసులు, ఇఫ్కో కంపెనీ ప్రతినిధులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్లోక అహల్య బాయ్ హోల్కర్ జయంతి ఉత్సవాలు

**కనిగిరి ఆర్సీఇంచార్జ్, పెన్ పవర్, మే 29**

పూజ్యశ్రీ పుణ్య శ్లోక అహల్యా బాయ్ హోల్కర్ 300 శత జయంతి ఉత్సవాలు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కన్వీనర్ జె. రమాదేవి మాట్లాడుతూ రాణీ అహల్యాబాయి ఇండోర్, మహేశ్వర్ ప్రాంతాల్లో అనేక హిందూ ఆలయాలను నిర్మించి ప్రసిద్ధికెక్కిందనీ, ఆమె రాజ్యాలకు ఆవల ఉన్న అనేక పవిత్ర స్థలాల్లో ధర్మశాలలు నిర్మించాలని తెలిపారు. వాటిలో తూర్పున ద్వారక (గుజరాత్) నుంచి మొదలుకొని వారణాసి, ఉజ్జయిని, నాసిక్, గయ, వైద్యనాథ్ ఆలయం (మహారాష్ట్ర) వంటి ప్రాంతాల్లో ధర్మశాలలు నిర్మాణం చేశారు. సోమనాథ్‌లో పాడుబడి, అపవిత్రమైవున్న సుప్రఖ్యాత సోమనాథేశ్వరాలయాన్ని ఆమె పునర్నిర్మించారు అని అన్నారు. కార్యక్రమంలో కో కన్వీనర్ ఆషా రావు గారు, జిల్లా ప్రధాన కార్యదర్శి నరాల శ్రీనివాస్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు నారాయణ, జిల్లా ప్రధాన అధికార ప్రతినిధి వెంకట్, మండల




## మండవ మురళీకృష్ణకు శివం ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కారం




**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు మే 29**

ఆంధ్రప్రదేశ్ కమ్మవారి సేవా సమాఖ్య చారిటబుల్ ట్రస్ట్ రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికైన పారిశ్రామికవేత్త సామాజిక సేవకులు మండవ మురళీకృష్ణను ఒంగోలు సంతపేటలోని శివం ఫౌండేషన్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కాశీనాయన ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా శివం ఫౌండేషన్ చైర్మన్ గొల్లపూడి శ్రీహరి శాలువాకప్పి గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ తాను శివం ఫౌండేషన్ పెట్టడంలో మండవ మురళీకృష్ణ తోడ్పాటు ఎంతో ఉందని, వారితోపాటు ఇంకా ఎంతోమంది శ్రేయోభిలాషులు శివం ఫౌండేషన్ ఎదుగుదలకు తోడ్పాటు అందించారని, అటువంటి మండవ మురళీకృష్ణ ఆంధ్రప్రదేశ్ కమ్మవారి సేవా సమాఖ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గా ఎంపిక కావటం ఇంకా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సమాజానికి ఆయన అందిస్తున్న ఎన్నో సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. ఈ సందర్భంగా శివం నిత్య అన్నదాన వాహనం ద్వారా ఒంగోలు నగరంలోని 300 మంది పేదలకు అనాథలకు అన్నదానం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మారెళ్ళ సుబ్బారావు, గుండ్ల కమ్మ సాహితీ సేవా సమాఖ్య అధ్యక్షులు మండవ సుబ్బారావు, చౌదరి, మన్నం శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

## వేసవి విజ్ఞాన శిబిరంలో ఉల్లాసంగా ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు





**చంద్రశేఖరపురం, పెన్ పవర్, మే 29**

చంద్రశేఖరపురం పట్టణంలోని పాఠశాలలో గ్రంథాలయ శాఖ గ్రంథపాలకుడు ఆళ్ళ భాస్కరరావు ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన తరగతులకు విద్యార్థులు ఎంతో ఉల్లాసంగా ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈరోజు 20 మంది విద్యార్థినీ విద్యార్థులు హాజరైనారు ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఎన్ వెంకట్రామయ్య, కె భారతి విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు శిక్షణకు వచ్చిన విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చదివించడం, యోగాసనాలు చేయించడంతోపాటు క్యారమ్స్, ఆటలు ఆడించుట లూడో ఆట వివిధ ఆటల పోటీలు నిర్వహించారు అనంతరం స్పోకెన్ ఇంగ్లీష్ గ్రామర్ గురించి తెలియజేశారు ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకుడు ఆళ్ల భాస్కర రావు, ఎన్ వెంకట్రామయ్య, కే శిరీష, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# అమడసాని ఆధ్వర్యంలో బహిరంగ సభకు తరలి వెళ్లిన టిడిపి శ్రేణులు







**చంద్రశేఖరపురం, పెన్ పవర్ మే 29**

కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశానుసారం చంద్రశేఖరపురం మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు పిలుపుమేరకు కోవిలంపాడు గ్రామ పార్టీ అధ్యక్షులు అమడసాని బాలకేశవరెడ్డి,చావా సుబ్బయ్య ఆధ్వర్యంలో కోవిలంపాడు, రెడ్డి గారి కొత్తపల్లి గ్రామాల నుండి తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మహానాడు బహిరంగ సభకు ఉత్సాహంతో భారీగా తరలి వెళ్లారు ప్రైవేట్ బస్సు ఇతర వాహనాలలో కార్యకర్తలు కేరింతల మధ్య టిడిపి నినాదాలు మార్మోగిపోయాయి ఈ సందర్భంగా అమడసాని బాల కేశవరెడ్డి మాట్లాడుతూ తెలుగుజాతి ఘన కీర్తిని విశ్వవ్యాప్తంగా తెలియజేసిన ఘనుడు ఆంధ్రుల అభిమాన ఆరాధ్య దైవం నందమూరి తారక రామారావు జన్మదినం సందర్భంగా జరుపుకునే మహానాడు ఈసారి దేవుని గడప కడపలో జరుపుకోవడం విశేష స్పందన లభించిందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వము అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్ర అభివృద్ధితోపాటు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వం అవసరమని ప్రజలకు స్పష్టమైందని మహానాడు బహిరంగ సభలో పాల్గొనడం కోసం స్వచ్ఛందంగా తరలి వస్తున్న టిడిపి శ్రేణులకు అభినందనలు తెలిపారు కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి కనిగిరి నియోజకవర్గం అభివృద్ధి కోసం కృషి చేస్తూ అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు రిలయన్స్ బయోగ్యాస్ కంపెనీ కనిగిరి నియోజకవర్గమునకు తీసుకొని వచ్చి నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించుటంతో పాటు అనేక పరిశ్రమలు అభివృద్ధి కార్యక్రమంలు చేపట్టుటకు కృషి చేస్తున్నారని అన్నారు. మహానాడు బహిరంగ సభలో పాల్గొనడమే కాకుండా పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని, ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి పథకాలు ప్రజలలోకి తీసుకువెళ్లాలని తెలిపారు ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు దొనపాటి మోహన్ రెడ్డి, శ్రీ నారాయణ స్వామి దేవస్థానం మాజీ కమిటీ మెంబర్ పాలపర్తి నారాయణరావు, విద్యా కమిటీ చైర్మన్ లు బాలకాశయ్య, కాల్వ నరసయ్య, తెలుగుదేశం పార్టీ నాయకులు చావా వెంకటసుబ్బయ్య, చావా రామయ్య, రావుల సూరి, డి టి నారాయణ, శేఖరు, గురవయ్య, మోసె మరియు టిడిపి శ్రేణులు

## దివ్యాంగుల పట్ల కనికరం చూపించండి సారూ!

**పొదిలి, పెన్ పవర్, మే 29**

సమాజంలో ఇబ్బందికరంగా జీవనం సాగిస్తున్న దివ్యాంగుల పట్ల కనికరం చూపించి, వారి సమస్యల పరిష్కారానికి గట్టి కృషి చేయాలని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవాసమితి జిల్లా అధ్యక్షులు ముల్లా మదార్ వలి కోరారు గురువారం నాడు ఆయన పొదిలి నగర పంచాయతీ నూతన కమిషనర్ కేఎల్ నారాయణరెడ్డిని కలసి తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు సబ్సిడీ రుణాల్లో దివ్యాంగులకు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఐదు శాతం రిజర్వేషన్ను అమలు చేసే విధంగా చూడాలని కోరారు స్వయం ఉపాధి కోసం రుణాల కై దరఖాస్తులు చేసుకున్న దివ్యాంగుల పట్ల కొన్ని బ్యాంకులకు చెందిన అధికారులు వారి ఆత్మ గౌరవాన్ని కించపరిచే విధంగా వ్యవహరిస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు ఈ విషయంపై కూడా అధికారులు దృష్టి సారించాలని మదర్ వలి కోరారు అలాగే దివ్యాంగుల హక్కుల చట్టం 20 16 ప్రకారం విచారించి, వికలాంగుల పట్ల చులకన భావంతో మాట్లాడే అధికారులను విచారించాలని ఆయన కమిషనర్ దృష్టికి తీసుకుని వెళ్లారు అలాగే గ్రామాల వార్డులు, సచివాలయా లు, ప్రభుత్వ కార్యాలయాల్లో దివ్యాంగులకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పిస్తూ, వారి సౌకర్యార్థం వీల్ చైర్లు, ర్యాంపులు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని దివ్యాంగుల సంఘం నాయకులు మదార్ వలి కమిషనర్కు విన్నవించుకున్నారు ఈ కార్యక్రమంలో వికలాంగుల సంఘం నాయకులు సయ్యద్ సుభాని, ఎం కృష్ణ, ఎస్ ఆరిఫా, మస్తాన్ భాష తదితరులు పాల్గొన్నారు.



# కవిత్వ గగనంలో వెలుగు పతాక గుంటూరు శేషేంద్ర శర్మ



– (1927 అక్టోబర్ 20 – 2007 మే 30)

" ధరిత్రిని హలం దున్నితే అప్పుడు అవుతుంది అది ఒక దేశం, ధరిత్రిని కలం దున్నితే అప్పుడు అవుతుంది అది ఒక ఇతిహాసం, హలమూ కలమూ దున్నని ధరిత్రి ధరిత్రి కాదు.. వట్టి మట్టి" ( జన వంశం కావ్యం, –గుంటూరు శేషేంద్ర శర్మ ) కవిత్వంలో చక్కదనాన్ని.. చిక్కదనాన్ని మేళవించి..మనిషి తాలూకు అన్ని అనుభవాలను..అనుభూతులను చిత్రిక పట్టి చూపించి నవకవిగా.. "యుగకవి"గా .. జాతీయ కవిగా గుంటూరు శేషేంద్ర శర్మ ప్రఖ్యాతి గడించారు. డాక్టర్ గుంటూరు శేషేంద్ర శర్మ పేరు తెలియని తెలుగువారు ఉండరు. నోబెల్ సాహిత్య బహుమతికి నూటికి నూరుపాళ్లు అర్హత గల కవి శేషేంద్ర శర్మ. శేషేంద్ర కవిత్వాన్ని మనం అవలోకించడం అంటే మానవ జీవితం తాలూకు అన్ని పార్శ్వాలను.. అనుభూతులను ఆస్వాదించడమే.. మనోనేత్రంతో సామాజిక వీక్షణ చేయడమే. శేషేంద్ర శర్మ కవిత్వ ఇంద్రజాలంలో చిక్కుబడని పాఠకుడు ఉండడు. ఆధునిక కవి కాళిదాసుగా శేషేంద్ర శర్మను సంభావన చేయవచ్చు. ఇంతకీ కవి అంటే ఎవరు? కవి బాధ్యత ఏమిటి? అనే ప్రశ్నకు శేషేంద్ర శర్మ అద్భుతమైన సమాధానమిచ్చారు. "తన కన్నుల్లో నీరు తెచ్చుకునే వాడికంటే అన్యుల కన్నుల్లో నీరు తెచ్చేవాడే కవి! ప్రజలారా! నేను కవిని, మీరు నాకు అప్పగించబడిన పిల్లలు, మీ ముసలి నమ్మకాలు మీ రక్తంలో భయాల్ని పొదుగుతున్నాయి, మీ రక్తం పారబోసి నా కవిత్వం నింపుకోండి" అంటూ ప్రజలలో చైతన్యాన్ని..ధైర్య గుణాన్ని శేషేంద్ర శర్మ ప్రబోధించారు. సమాజంలో కవి ధర్మం ఇదేకదా!. ప్రకృతికి..మనిషికి నడుమ ఉండే అనుబంధాన్ని కూడా శేషేంద్ర శర్మ తన కవిత్వం ద్వారా తెలియ చెప్పారు. శేషేంద్ర శర్మ రచనల్లో ఈ లక్షణం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ప్రకృతిని అర్థం చేసుకోకుండా ఎవరూ ఉత్తమమైన కవిత్వాన్ని రాయలేరనేది శేషేంద్ర శర్మ భావన. శేషేంద్ర కవితా జాలం : "వేళ్లు కాళ్లయి నడిచే చెట్టు మనిషి.. చెట్టుగా ఉంటే ఏడాదికి ఒక వసంతమన్నా దక్కేది.. మనిషినై అన్ని వసంతాలను కోల్పోయాను" అంటూ నిర్వేదాన్ని వ్యక్తం చేసారు శేషేంద్ర శర్మ.




**సమాజంలోని దోపిడీ**

శక్తులపై శేషేంద్ర కవితాస్త్రాలను సంధించారు. " ఈ చెట్లు పూలెందుకు పూస్తాయి? ఈ నికృష్టపు నాగరికత విడిచే బొగ్గుపులుసు వాయువు పీలుస్తూ .. ఇవి బుల్లెట్లెందుకు పూయవు అని కేక వేస్తే "అని శేషేంద్ర పేర్కొన్నారు. ",బాబూ ! నీ చిన్ని కన్నీటి బిందువులో ఏ సముద్రం గర్జిస్తుందో నాకు తెలుసు. అందుకే నేను చెట్లతో మొర పెట్టుకుంటున్నాను ఆకులు కాదు తుపాకులు కాయండి" అంటూ శేషేంద్ర శర్మ తనలోని విప్లవ భావాలను ఆవిష్కరించారు." ఇక్కడ గర్భంలో శిశువు గర్భంలోనే ఉండి పోవాలి. ఈ దేశంలోకి వచ్చి ఆకలి అని ఏడిస్తే ఫుట్పాత్ లు చూపిస్తారు " అంటూ నేటి సమాజ దౌర్భాగ్యాన్ని కళ్ల ముందుంచారు శేషేంద్ర శర్మ. " అరే! నా దేశంలోనే నా గొంతు పరాయిదయిపోయింది. ఇక్కడ నేను అరచిన అరుపు ఆకాశంలోకి వెళ్లి ఎక్కడో ఇరుక్కు పోతుంది తిరిగి రాదు. అరే! ఈ గుంపుకు ఎలా మేల్కోవాలో తెలియదు. ఎలా బాహువులు జాపి తన ఇనుప కాళ్లు ఇలాతలంపై మోపాలో తెలియదు " అంటూ ఆత్మవిశ్వాసం లోపించిన భరత జాతి గురించి.. మానవ జాతి గురించి శేషేంద్ర శర్మ తెలియ చెప్పారు.బాలల..యువత భవితవ్యం గురించి శేషేంద్ర ఆవేదన చెందారు." నీవు కాలేజీకి పోతుంటే బాబూ! నిన్ను పొలాలు బిక్క మొగంతో చూస్తున్నాయి..

నీవు కాలేజీ గోడల్లోకి.. అక్కడి నుండి గవర్నమెంట్ గోడల్లోకి.. ఎప్పుడు ఎవరు తిరిగి రాని గోడల్లోకి పోతావు.. ఇక నీవు బ్రతికింది ఎప్పుడు!! మీ నాన్నల తరం అదే చేసింది.. మీకు ఆ ప్రశ్న వారసత్వంగా ఇచ్చి పోయింది.. మీరు పలకా పుస్తకాలు పట్టుకొని పోతుంటే బాబూ! మీరు శిలువలు మోసుకుపోతున్న బాల క్రైస్తుల్లా కనిపిస్తారు నా కళ్లకు " అంటూ ఆలోచనా విధానం లోపించిన నేటి కాలపు మూస చదువుల గురించి..డొల్ల విద్యా విధానం గురించి శేషేంద్ర శర్మ వెల్లడి చేసారు. అంతటితో ఊరుకోకుండా బాలలలో.. యువతలో కొత్త ఆలోచనలను రేకెత్తించేందుకు..వారిలో ఆత్మ విశ్వాసాన్ని ప్రోది చేసేందుకు శేషేంద్ర శర్మ కృషి చేసారు.

"లే బాబూ! లే ! నీ బాల్యం లోంచి లే!

పుస్తకాలవతల పారేయ్! నాగలి భుజాన వేసుకో! ఈ కులాలు విడిచిపెట్టు. పొలాల్లో కలువు.. గత కాలపు దారులకు కఠినంగా వీడ్కోలు చెప్పు" అంటూ నేటి కాలపు వ్యర్థమైన చదువులకన్నా వ్యవసాయం ద్వారానే నిజమైన ప్రయోజనం చేకూరుతుందని శేషేంద్రశర్మ చాటిచెప్పారు. వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేయవద్దంటూ దశాబ్దాల క్రితమే శేషేంద్ర శర్మ చేసిన ప్రబోధం ఆయన ముందు చూపును తెలియ చెబుతుంది. స్వేచ్ఛను కలిగి ఉండవలసిన అవసరం గురించి శేషేంద్ర శర్మ గొప్ప సందేశాత్మక కవితను అందించారు. "స్వేచ్ఛ మనిషికి మొదటి శ్వాస..అది నా రక్తపు సజీవ భాష.. భూమి నుండి చివరి అడుగు తీసే వరకు నిలుపుకోవలసిన ఒకే ధ్యాస "అంటూ స్వేచ్ఛ ప్రాధాన్యతను వెల్లడించారు శేషేంద్ర శర్మ. సామాన్యులు బతకలేక ఏడుస్తుంటే కొంతమంది సుఖాలలో తేలియాడుతూ ఉండడం శేషేంద్ర శర్మకు ఆగ్రహం తెప్పించింది. "నవ్వు మొహాన రాసిన వాళ్లని చూస్తే నా చెయ్యి బాంబు కోసం వెతుకుతుంది.. వాళ్లకు నవ్వేంత సుఖం ఎలా దొరికింది? ఎవడికి లంచమిచ్చి కొనుక్కున్నారు? పాపం! అమాయకులు.. నీతిపరులు ఈ దేశంలో అంత ఖరీదైన నవ్వును కొనుక్కోలేరు" అంటూ దోపిడీ వర్గాల తీరుతెన్నులను శేషేంద్ర శర్మ గర్హించారు. దేశంలో నానాటికీ పెచ్చు పెరుగుతున్న బానిస మనస్తత్వాల గురించి కూడా శేషేంద్ర శర్మ హెచ్చరికగా పలికారు. " ఈ దేశంలో వంగే వాడికి వంగి సలాం చేసేవాడు పుడుతున్నాడు జాగ్రత్త ! ఈ లక్షణం తలెత్తిందంటే ఆకాశంలో తోక చుక్క పుట్టిందన్న మాటే !" అంటూ శేషేంద్ర ప్రజలను జాగృతులను చేసేందుకు యత్నించారు. అధికార పీఠాలను అధిష్ఠించిన వాడు తను.. తన అధికార పీఠం శాశ్వతమని భ్రమిస్తాడు తప్ప నిజం గ్రహించలేడు. ఈ విషయాన్ని శేషేంద్ర శర్మ నిర్భయంగా చాటి చెప్పారు. " ఏ మెరుపు అయితే గర్జించి ఆకాశాన్ని శతకోటి శకలాలుగా ఛేదిస్తుందో, నక్షత్ర మండలాల్ని గజ గజ వణికిస్తుందో అదే రెండో క్షణం అక్కడలేదు, కానీ నేల మీద కుర్చీ ఎక్కిన వాడికి వాడి శాశ్వతత్వం మీద ఎంత అచంచల విశ్వాసం! " అంటూ ఏదీ శాశ్వతం కాదనే సత్యాన్ని శేషేంద్ర శర్మ తేటతెల్లం చేసారు."మండే సూర్యుడు" అనే కవిత కవిగా శేషేంద్ర శర్మలోని ఆధునిక దృష్టి కోణాన్ని వెల్లడి చేస్తుంది. " నేను చెమట బిందువును .. కండల కొండల్లో ఉదయించే లోక బంధువును..

**గుండెలతో నాకు దోస్తీ..**

నేనుండేది బాధల బస్తీ... సింధువంత చరిత్ర పిడికిట్లో ఉన్నా చెప్పకుండా మనిషిని చెక్కిన శిల్పిని " అంటూ తనను తాను కార్మిక శ్రామిక కర్షక వర్గ ప్రతినిధిగా శేషేంద్ర శర్మ చాటుకున్నారు. ఈ దేశంలో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించే వారికన్నా అణచి వేయాలని చూసే వారే ఎక్కువ. ప్రతిభకు ఎదురవుతున్న నిరాదరణ గురించి శేషేంద్ర శర్మ మరో కవితలో తెలియజెప్పారు. "ఈ దేశం నా ప్రతిభకొక సమాధి.. ఎంత వడివడిగా నడిచినా ఎప్పుడూ దూరం అంతే ! ఈ నేల నా రక్తం తాగాలని దప్పి గొన్నది. ఆముదపు చెట్ల నీడల్లో హాయిగా నిద్రిస్తున్న ఈ దేశానికి సూర్యుడిలో కలం ముంచి గ్రీష్మ గీతం రాద్దామని తెల్ల కాగితం పుచ్చుకున్నాను" అంటూ సమాజ చైతన్యంలో కవుల బాధ్యతను..పాత్రను శేషేంద్ర గుర్తు చేసారు. "కలలు" అనే మరో కవితలో శేషేంద్ర "రాత్రి నేనూ నా దిండు కలిసి కలలు కంటాం.. పగలు నేనూ, నా కలం వాటిని పంచుకుంటాం.. నా కాళ్లు సంకెళ్లలో ఉన్నా నా కలలు కొండలమీద సంచరిస్తాయి" అంటూ తన కవిత్వ తత్త్వాన్ని వెల్లడించారు. ' పైన చంద్రుడు మబ్బు తునక వేలు పట్టుకొని నడిపించుకు పోతున్నాడు.. బాధల్లో మునుగుతాను.. సంతోషాల్లో ఉదయిస్తాను .. నేను మానవ సూర్యుణ్ణి " అంటూ అందమైన పద చిత్రాలను, భావ చిత్రాలను శేషేంద్ర శర్మ తన కవితలో విలిఖించారు. " కందరాల కంఠానికి లొంగి ఇక్కడ ఆకాశం సూర్యుడ్ని అమ్ముకుంది గుప్పెడు నక్షత్రాల కోసం" అంటూ వ్యవస్థ దుస్థితిని శేషేంద్ర శర్మ మరో కవితలో దృశ్యమానం చేసారు.


**" గాలి కుక్కలా తిరుగుతోంది వీధుల్లో..**

పిల్లిలా మ్యావ్ అంటుంది కిటికీలో.. గాలి కోడెనాగులా బుస కొడుతోంది. గాలి దెబ్బతిన్న సైనికుడిలా మూలుగుతోంది ఆకుల్లేని కొమ్మల్లో .. నా చేతిలో పుస్తకం శిశువై నా వక్షస్థలం మీద ఆడుకుంటోంది..వెయ్యి నక్షత్రాలు ఒక్కసారి లక్ష వెల్తురు ఈటెలు విసిరాయి నా మీదకి" అంటూ శేషేంద్ర శర్మ కవితా చమత్కారాన్ని ప్రదర్శించారు. కవి నిరంకుశుడు.. ఆత్మ స్వాతంత్ర్యం కలిగిన వాడు. ఎవరి ఆదేశాలకు తలొగ్గే స్వభావం నిజమైన కవిలో కనిపించదు. ఈ విషయాన్ని శేషేంద్ర శర్మ మరో కవిత ద్వారా స్పష్టం చేసారు. " సముద్రం ఒకడి కాళ్ల దగ్గర కూర్చుని మొరగదు.. తుఫాను గొంతు చిత్తం అనడం ఎరుగదు... పర్వతం ఎవడికీ వంగి సలాం చెయ్యదు .. నేనింతా ఒక పిడికెడు మట్టే కావచ్చు.. కానీ కలమెత్తితే నాకు ఒక దేశపు జెండాకున్నంత పొగరుంది" అంటూ కవి స్వాతంత్ర్యాన్ని శేషేంద్ర శర్మ గొప్పగా తెలియ చెప్పారు. " నా కవిత్వం కేవలం మనిషికి డిఫెన్స్.. నేను జేబులో కోకిలలు వేసుకు రాలేదు.. పిడికిళ్లలో బాంబులు బిగించుకు వచ్చాను" అంటూ తన కవిత్వంతో వ్యవస్థను మారుస్తాననే సందేశాన్ని శేషేంద్ర శర్మ ఇచ్చారు. " బాబూ! మనం తుపాకులు ఎదుర్కోగలం.. కానీ నియంతలు ప్రశ్నలు ఎదుర్కోలేరు..." అంటూ ప్రశ్నించడాన్ని సహించలేని నియంతల మనస్తత్వాలను , తీరుతెన్నులను శేషేంద్ర శర్మ వెల్లడిల చేసారు. "ఆకాశం సూర్యుడి దేవాలయం ..లోకం చరాచర వస్తు గ్రంథాలయం.. చెట్లు పూలు పుచ్చుకొని నిల్చొనున్న భక్తుల సమూహం.. నేను ఆలోచనలో మునిగి ఉన్న జలాశయం" అంటూ అందమైన భావజాలాన్ని తన కవితలో ప్రదర్శించారు శేషేంద్ర. సమాజంలో కవుల బాధ్యత గురించి కూడా శేషేంద్రశర్మ గొప్పగా గుర్తు చేసారు. " మనిషి కన్నీరు తుడవడం నీ వంతు.. శరీరం పోయినా గెలిచేది నీ గొంతు... నీ ఛాతి బందూకుల కార్ఖానా ! నీ కవిత్వం గాయాలకు దవాఖాన... నీ మెడలో వేలాడేది గాయాల దండ ..

**నీవు మా యుద్ధాలకు నైతిక ఝండా!**

అంటూ శేషేంద్ర శర్మ కవి కనిపించని శత్రువులతో పోరాడే యోధుడని, సమాజ గాయాలను మాన్పే శస్త్ర వైద్యుడని విశదం చేసారు. దేశం కోసం జీవితాలను త్యాగం చేసిన వారికి ఈ వ్యవస్థలో కనీస గౌరవం దక్కక పోవడం శేషేంద్రను కలచి వేసింది. " ఇది దేశమా లేక కంఠ పాశమా!! అరే ! ఈ మట్టి కోసం బలి అయిపోయిన ఆత్మల సమాధుల మీద గడ్డి కూడా మొలవదు... ఇక్కడ రాజకీయ నాయకుడు ఇరుసుగా తిరుగుతోంది పత్రికల భూగోళం.." అంటూ రాజకీయ నాయకులు దేశాన్ని భ్రష్టు పట్టిస్తున్న తీరుతెన్నులను శేషేంద్ర శర్మ నిర్భయంగా తెలియ చెప్పారు. " నది పొలాల వైపు పరుగెత్తింది అన్నార్తుల్ని రక్షిద్దామని .. చెయ్యి రైఫిల్ వైపు పయనించింది ప్రజాద్రోహుల్ని శిక్షిద్దామని "అంటూ శేషేంద్ర శర్మ తనలోని విప్లవ భావాలను ఆవిష్కరించారు. స్వాతంత్ర్యం మనకేమిచ్చింది!? అనే ప్రశ్నకు శేషేంద్ర శర్మ చెప్పిన సమాధానం నూరుపాళ్లు వాస్తవం." అరే ఈ దేశం మీ కేమిచ్చింది, వంకర టింకర్లుగా వంగే దేహం, బానిసత్వం మీద వ్యామోహం, మీరెగరేశే జెండా మీకేమిచ్చింది, ఐదేళ్లకోసారి ఓట్లు, ఆ మధ్యలో కునికిపాట్లు" " తెలుసా బిడ్డా ! ఈ దేశంలో రాజకీయ రుతువు రాగానే ఓట్ల డబ్బాలకు గర్భస్రావం జరుగుతుంది, ప్రజాస్వామ్య శిశువు ప్రసవం ఎప్పుడూ జరగదు ,

ఓట్ల వరి కోతలు మాత్రం యథా విధిగా జరుగుతాయి" అంటూ వ్యాఖ్యానానికి అతీతమైన నేటి దుస్థితిని శేషేంద్ర దశాబ్దాల క్రితమే తన కవిత్వం ద్వారా ఆవిష్కరించారు. పైత్య ప్రకోప కవిత్వంతో ప్రజలను భయపెట్టే అకవులు , కుకవుల గురించి చెబుతూ శేషేంద్ర అలాంటి వారి జోలికి పోకుండా ఉండడమే హాయని పేర్కొన్నారు. శేషేంద్ర కవితా జాలాన్ని పలు కవితల్లో చూడవచ్చు. " నీ కోసం లోకాన్ని మోసుకొచ్చే వార్తాపత్రిక ..రోజూ నీ గుమ్మంలో పూచే లిల్లీ.. టేబుల్ మీద పడుకోనున్న టెలిఫోన్ ..అప్పుడప్పుడు మ్యావ్ మనే పిల్లి " అంటూ కవితా చమత్కారాన్ని శేషేంద్ర ప్రదర్శించారు. " నదులు కవులు భూగోళపు రక్తనాళాలు .. నదులు ప్రవహిస్తాయి కవితల్లా.. పశువుల కోసం పక్షుల కోసం మనుషుల కోసం ... నదులు కంటున్న కలలు పొలాల్లో ఫలిస్తాయి... కవులు కంటున్న కలలు మనుషుల్లో ఫలిస్తాయి... నదులు దేశాన్ని సాగుచేస్తే కవులు ప్రజల్ని సాగుచేస్తారు...కవులు మానవ జాతి రక్త కణాల మీద పని చేసే అలంకారాల నదులు" అంటూ నదులు, కవుల ప్రాధాన్యతను శేషేంద్ర శర్మ అనితరసాధ్యంగా తెలియజెప్పారు. ఆదికవి వాల్మీకి కవిత్వంలోని వర్ణనాత్మక ప్రతిభ గురించి శేషేంద్ర శర్మ గొప్పగా చాటి చెప్పారు. "వాల్మీకి పెదవి కదిపితే చాలు చిలుక కొరికితే దానిమ్మ గింజలు రాలినట్లు రాలుతాయి ఉపమలు " అంటూ వాల్మీకి కవిత్వంలోని ఆలంకారిక రామణీయకత గురించి శేషేంద్ర శర్మ సోదాహరణంగా చాటి చెప్పారు. " నదీమ్ పుష్పోడుప వహాం " నది పువ్వులనే పడవల్ని మోసుకుపోతున్నది అంటూ శేషేంద్ర శర్మ వాల్మీకి వర్ణనాత్మక ప్రతిభను చాటిచెప్పారు. నిజంగా ఈ వర్ణన చదివితే గంభీరంగా మంద్రంగా సాగే నదీ ప్రవాహం..ఆ ప్రవాహంలో పడవల్లా తేలుతూ పోయే రంగు రంగుల పువ్వులు మనో నేత్రానికి





సాక్షాత్కరిస్తాయి. కవిత్వం ద్వారా పాఠకులకు విషయాన్ని దృశ్యమానం చేయడంలో వాల్మీకికి సాటి వచ్చేవారు లేరు. శ్రీరాముడు శీతల జలాలతో ఆచమనం చేసిన విషయాన్ని కవిత్వ సౌందర్యం ఉట్టిపడేలా వాల్మీకి అద్భుతంగా వర్ణించారు. "ఉపాస్ప్రుశత్ సుశీతేన జలేనోత్పల గంధినా" కలువపూల సువాసనలు గుబాళించే శీతల జలాలతో రాముడు ఆచమనం చేసాడట! వాల్మీకి చేసిన వర్ణన శ్రీరాముని ముగ్ధమోహన రూపాన్ని పాఠకుల కళ్ల ముందు నిలుపుతుంది. నీలాకాశంలో చంద్రుడు సాక్షాత్కరించాడు అనే సామాన్య వర్ణనలో కవిత్వం లేదు.కానీ వాల్మీకి వంటి మహాకవుల దృష్టి వేరు. చక్కటి పోలికలు చెప్పడంలో వారు సిద్ధహస్తులు. "ప్రజ గామ నభః చంద్రః హంసో నీల మివోదకం " నీలి జలాల్లోకి హంస ప్రవేశించినట్లు గా చంద్రుడు నీలాకాశంలోకి ప్రవేశించాడు" అనే వాల్మీకి మహర్షి వర్ణన చదివితే పట్టపగలైనా సరే రాత్రి కాలపు నీలాకాశం..అందులో వెండి వెన్నెలలు వెదజల్లే చంద్ర బింబం..నీలి రంగు జలాలలోకి విలాసంగా ప్రవేశించి ఈదులాడుతున్న రాజ హంస సౌందర్యం తప్పక దృశ్యమానం అవుతాయి. ఇలాంటి మనోహర వర్ణనలు చదివితే నిస్సందేహంగా మన ఆయుష్షు మరికొన్నాళ్లు పెరుగుతుంది.రక్తాన్ని ఉద్రేకించే..మనసును వేడెక్కించే కవిత్వం మనిషిని పక్కదారి...పెడదారులు పట్టేలా చేస్తుందని గ్రహించాలి. సీతాదేవి ఎడమ కన్ను అదరడం గురించి వాల్మీకి చేసిన వర్ణన ఆ మహాకవికి మనం చేతులు జోడించేలా చేస్తుంది. "ప్రాస్పంద తైకం నయనం సు కేశ్యాః మీనా హతం పద్మ మి వాభితామ్రం " పద్మాలు వికసించిన కొలనులో ఈదులాడుతున్న చేప తోక చివరి భాగం తగిలి స్వల్పాతిస్వల్పంగా కంపించిన పద్మంలా సీతాదేవి ఎడమ కన్ను అదిరిందట. వాల్మీకి రామాయణంలోని ఇలాంటి మనోహర వర్ణనలను గుంటూరు శేషేంద్ర శర్మ తన వ్యాసాలలో విశదం చేసారు.

వాల్మీకి పట్ల శేషేంద్ర శర్మకు గల అభిమానం...పూజ్య భావం చాలా గొప్పవి. " వాల్మీకి నదుల్లో గంగానది లాంటివాడు.. అరణ్యాలలో నైమిశారణ్యంలాంటివాడు" అంటూ శేషేంద్ర శర్మ శ్లాఘించారు.

మహాకవి కాళిదాసు గురించి శేషేంద్ర శర్మ అద్భుతమైన విషయాన్ని చెప్పారు. "వ్యాసుడు ...వాల్మీకి దేశానికి వారసత్వంగా ఇచ్చిపోయిన సాహిత్య సంస్కృతికి కాళిదాసు చివరి కాపలాదారు. కాళిదాసు తరువాత ఆ సంస్కృతి పతనమైంది అంటూ శేషేంద్ర పేర్కొన్నారు. "భారతీయ కావ్య సామ్రాజ్యంలో వాల్మీకి వ్యాస కాళిదాసులు సగర దిలీప రఘు చక్రవర్తుల వంటి ఆదిమ చక్రవర్తులు. సగరాదుల రాజ్యాలు పోయినా కావ్య సగరుల సామ్రాజ్యాలు పోలేదు" అంటూ మహాకవుల కవిత్వం ఎలా శాశ్వతంగా నిలుస్తుందో శేషేంద్ర శర్మ వెల్లడి చేసారు. "కవులు కావ్యాలనే వసంతాల్ని నాటి పోతారు. వాళ్లు నాటిన వసంతాలు వాళ్ల కోసం కాదు. అవి రాలిపోతుంటాయి.. మరలా పూస్తుంటాయి. ఆపరాని ఈ అద్భుత కుసుమ చక్రం మనిషిని లోకపు ఎడారి నుండి రక్షిస్తూ ఉంటుంది. మూర్ఖులకు తెలియని మర్మమిది " అంటూ 'కాలరేఖలు' లో శేషేంద్ర శర్మ తన నిశ్చితమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేసారు. "కాలరేఖ " రచనకు గాను గుంటూరు శేషేంద్ర శర్మకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. నేడు కవుల్లో ఉన్న వర్గీకరణను శేషేంద్ర శర్మ అంగీకరించలేదు. " పూర్వం కాళిదాసాది కవుల్ని కవులు అన్నారేగాని శృంగార కవులని , కరుణ రస కవులని పిలవలేదు. ఏ దేశంలోనైనా కవులను కవులనే అన్నారు. కానీ తెలుగు గడ్డ మీద మాత్రం స్వప్రయోజన పరులైన మోనో పలి మనస్తత్వ వాదులు ఆత్మరక్షణ కోసం తమకు నచ్చిన వాళ్లను మాత్రమే విప్లవ కవులని పేరు పెట్టారు.ఇది అశాస్త్రీయం " అంటూ శేషేంద్ర శర్మ కుండబద్దలు కొట్టారు. అందుకే కవులంటే.. కవిత్వం అంటే ఎలా ఉండాలో శేషేంద్ర శర్మ " కవిసేన మేనిఫెస్టో" ద్వారా తెలియ చెప్పారు. అవకాశవాదాన్ని , స్వార్థపరత్వాన్ని శేషేంద్ర శర్మ తీవ్రంగా నిరసించారు. ఆ విధమైన దుర్లక్షణాలు కవులలో ఉండటం సమాజ ఆరోగ్యానికి మంచిది కాదని ఆయన స్పష్టం చేసారు. విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూరు తరువాత నోబెల్ సాహిత్య పురస్కారానికి పేరు నామినేట్ అయిన ఏకైక భారతీయ కవి డాక్టర్ గుంటూరు శేషేంద్ర శర్మ. "ఆధునిక మహాభారతం" శేషేంద్ర శర్మ పేరును శాశ్వతం చేసే గొప్ప కావ్యం. జనవంశం ఆధునిక మహాభారతం కావ్యానికి అనుబంధ కావ్యంగా శేషేంద్ర శర్మ స్వయంగా పేర్కొన్నారు. నా దేశం నా ప్రజలు, ఋతు ఘోష, శేష జ్యోత్స్న, స్వర్ణ హంస, షోడశి రామాయణ రహస్యములు, మండే సూర్యుడు, నరుడు నక్షత్రాలు వంటి రచనలు శేషేంద్ర శర్మ లేఖిని నుండి వెలువడి విశేష జనాదరణ పొందాయి. పలు అనువాద రచనలు కూడా శేషేంద్ర శర్మ చేసారు. ఆధునిక భావాలను ప్రాచీన ఛందస్సుల ద్వారా తెలియ చెప్పడం సాధ్యమేనని శేషేంద్ర శర్మ నిరూపించారు.కవులను మానవ జాతి రక్త నాళాల పై పని చేసే అలంకారాల నదులుగా అభివర్ణించడం ఒక్క శేషేంద్ర శర్మకే చెల్లింది. ప్రతి జాతికి తనదైన అభివ్యక్తి మాధ్యమం ఒకటి ఉంటుందని తెలుగు జాతి అభివ్యక్తి మాధ్యమం కవిత్వం కావడం వల్ల తాను కూడా కవిత్వ మార్గాన్ని స్వీకరించి రచనలు చేసినట్లు శేషేంద్ర శర్మ వెల్లడించారు. నేటి కాలపు కవిత్వం గురించి శేషేంద్ర శర్మ ఒక సందర్భంలో మాట్లాడుతూ కవిత్వం పేరుతో నేడు కవిత్వం చలామణి అవుతున్నదని పేర్కొన్నారు. నిజమైన కవులు ఉన్నారు.. నిజమైన కవిత్వం ఉంది.

కవులు కాని వారే కవిత్వ రంగంలోకి ప్రవేశించి కవిత్వాన్ని చంపుతున్నారని , దొంగ కవులను.. దొంగ రచయితలను వారు కూర్చున్న కుర్చీలతో సహా ఉష్ణ తైల కాసారాలలోకి విసిరి వేయాలంటూ ఆగ్రహం వ్యక్తం చేసారు.

ఎవరు బడితే వారు కవులుగా రాణించలేరని, కవిత్వం ఆషామాషి వ్యవహారం కాదనే సత్యాన్ని శేషేంద్ర శర్మ ఎరుక




పరిచారు. " అక్షరాల ఇసుకతో కవిత కట్టలేరు.. తలపుల నెత్తావులు చిమ్మే మృదు హృదయ

సుమ ధూళి కావాలి.. జీవన మధూళితో తడవాలి.. జీవితంలో లేని కవిత కాగితంలో వస్తుందా!! మబ్బు తునక లేకుండా చినుకు నేలకు రాలుతుందా!! సుందర భావ జగత్తు సృష్టించలేని వాడు ముసలి పదాలతో మురిపేలాడుతూ సరిపుచ్చుతాడు.ఊహకు రెక్కలున్న వాడు ఉదధులు దాటుతాడు. ఉత్తుంగ శిఖరాలకు ఎగురుతాడు. వాడే చైతన్యం..వాడే చరిత్ర సృష్టిస్తాడు" అంటూ కవిత్వ రచన ఎంత గహనమైనదో వెల్లడి చేసారు శేషేంద్ర శర్మ. నేడు రైతుల దుస్థితి గురించి వర్ణిస్తూ శేషేంద్ర " ఈ దేశపు గర్భ గుడిలో దేవుడు జీర్ణమై పోయాడు. రైతు నాగలి మోస్తున్నాడు క్రీస్తు సిలువ మోసినట్లు" అని రైతుల దయనీయ స్థితిని కరుణ రసాత్మకంగా దృశ్యమానం చేసారు. తన కవిత్వ మార్గం గురించి శేషేంద్ర వివరిస్తూ శేషేంద్ర శర్మ " ఏ రస్తా అయితే ప్రజా కోట్ల అడుగులతో పునీతం అయ్యిందో, ఏ రస్తా అయితే లోకం సుఖం కోసం తను కష్టాన్ని వరించిందో, ఏ రస్తాలో మరణం కూడా మహా ప్రబంధంగా ప్రతిధ్వనిస్తుందో అదే నా రస్తా" అంటూ తెలియ చెప్పారు. బాధల్లో మునుగుతాను.. సంతోషాల్లో ఉదయిస్తాను.. నేను మానవ సూర్యుణ్ణి" అంటారు శేషేంద్ర. కార్మిక శ్రామిక కర్షక వర్గాలను నిర్లక్ష్యం చేయవద్దని శేషేంద్ర శర్మ పాలక వర్గాలను హెచ్చరించారు." నాగలి భుజాన వేసుకున్న వాడే ఆకలి తీర్చుకునే హక్కును కూడా సంపాదించుకున్న వాడు.ఈ ఏడాది మొలిచిన పైర్లకు దుఃఖం తీరక పోతే వచ్చే ఏడాది ఒట్టి కొడవళ్ళు పట్టుకున్న పిడికిళ్ళే మొలుస్తాయి..ఒక చిన్న తారతో దినమవుతుందా? మండే సూర్యుడు కావాలి.. పదండి! మీ జెండానై ఎగురుతాను" అంటూ శేషేంద్ర రైతులకు ధైర్యం ప్రబోధించారు.సామాన్యులు సంఘటిస్తే బలవంతులు తోక ముడువ బలసిందేనంటూ స్పష్టం చేసారు." ఈగలు డేగల్ని తరిమికొట్టే తారీఖు రోదసి గోడల మీద రాయండంటూ శేషేంద్ర శర్మ పీడిత జనావళి మనసుల్లో చైతన్య బీజాలను నాటారు.తాను ఆశించిన నవోదయం సాకారం కావాలని శేషేంద్ర గట్టిగా కోరుకున్నారు." సూర్యుడు ఈ శుభ దినాన్ని మోసం చెయ్యనివ్వను.ఈ దేశపు ప్రాచీ రేఖ మీద సూర్యుడు ఉదయించకపోతే మండే నా గుండె చీల్చి దాని మీద పెడతా! ఎర్రటి నా కండలతో ఎండలు కాయిస్తా" అంటూ శేషేంద్ర శర్మ కవితాత్మకంగా పేర్కొన్నారు. గుంటూరు శేషేంద్ర శర్మ ప్రతిభా పాటవాలను గుర్తించి పలు సంస్థలు ఆయనను ప్రతిష్ఠాత్మక పురస్కారాలతో ఘనంగా సత్కరించాయి. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం " రాష్ట్రేందు" పురస్కారంతో గౌరవించింది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం డి లిట్ తో శేషేంద్ర శర్మను సత్కరించింది. మధ్య ప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక కాళిదాస్ సమ్మాన్ అవార్డును ప్రదానం చేసింది. కాలరేఖ రచనకు గాను శేషేంద్ర శర్మ కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని అందుకున్నారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం హంస అవార్డుతో శేషేంద్రను గౌరవించింది. సుబ్రహ్మణ్య భారతి ఏక్ తా పురస్కారంతోపాటు సాహిత్య రత్న వంటి పలు బిరుదులు శేషేంద్ర శర్మను వరించాయి. నా దేశం నా ప్రజలు కావ్యం నోబుల్ సాహిత్య పురస్కారానికి నామినేట్ కాబడి శేషేంద్ర శర్మకు విశేష గౌరవ మర్యాదలను సంతరించి పెట్టింది. జ్ఞానపీఠ్ పురస్కారంతోపాటు మరెన్నో పురస్కారాలకు నిజమైన అర్హత కలిగిన వ్యక్తి గుంటూరు శేషేంద్ర శర్మ. ముత్యాల ముగ్గు చిత్రానికి శేషేంద్ర శర్మ రచించిన "నిదురించే తోటలోకి పాట ఒకటి వచ్చింది" అనే ఒకే ఒక్క పాట ఆయనకు ఎంతో గుర్తింపును తీసుకు వచ్చింది. ప్రముఖ గాయని పి సుశీల ఎంతో ఆర్ద్రంగా ఆ పాటను ఆలపించారు. ఆ ఒక్క పాట శేషేంద్ర శర్మను భావుకతా శిఖరాగ్రాన నిలిపింది. గేయ రచయితగా శేషేంద్ర శర్మ ప్రతిభను సినీ పరిశ్రమ సద్వినియోగం చేసుకుని ఉంటే మరెన్నో అద్భుత గీతాలు శేషేంద్ర లేఖిని నుండి వచ్చి ఉండేవి. శేషేంద్ర శర్మ ప్రతిభా పాటవాలను పలువురు ప్రస్తుతించారు. " గుంటూరు శేషేంద్ర శర్మ కవిత్వం వాస్తవికమైన అభినివేశంతో కూడుకున్నదని" అమరేంద్ర శ్లాఘించారు. " శేషేంద్ర శర్మలా రచన చేయగలిగిన వారు ఈనాడు పట్టుమని పదిమంది కూడా లేరని" కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ శేషేంద్ర శర్మ కవితా వైభవాన్ని ప్రస్తుతించారు. " శ్రీనాథుని క్రీడల్లో..అల్లసాని వాడల్లో దొరకని పద చిత్రాలు శేషేంద్ర శర్మ కవిత్వంలో దొరుకుతాయని" శ్రీ శ్రీ ప్రశంసించారు. కవి వేకువ పిట్ట. తొలకరి పాట. అంధకారంలో గురకలు పెట్టే జాతిని మేల్కొల్పే వైతాళికుడు. శేషేంద్ర శర్మ నిస్సందేహంగా ప్రజాకవి.. యుగ కవి. నిదురించే తోటలోకి కోకిల పాటలా ప్రవేశించి కవితా వసంతాన్ని ఆవిష్కరించి కవిత్వ పరిమళాలను దశదిశలా వ్యాపింప చేసిన నిత్య కవితా యశస్వి డాక్టర్ గుంటూరు శేషేంద్ర శర్మ. ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రలో డాక్టర్ గుంటూరు శేషేంద్ర శర్మ పేరు సువర్ణాక్షరాలతో లిఖించబడి ఆ మహాకవిని మనకు ఎల్లప్పుడూ గుర్తు చేస్తూనే ఉంటుంది. " నా హృదయాన్ని ఆకాశంలోకి జెండాగా ఎగరేశాను గాలుల్లో ఎగురుతున్న ఆ రంగుల పేలిక ఈ యుగానికి నాలిక ఒకనాడు నా శరీరం అంతర్ధానమవుతుంది. అప్పుడు మీకు నా వాక్యాల్లోనే దర్శనమిస్తాను" అని జనవంశం కావ్యంలో శేషేంద్ర శర్మ పేర్కొన్న మాటలు అక్షర సత్యం. నేడు శేషేంద్ర శర్మ భౌతికంగా లేకున్నా తన కవిత్వం రూపంలో కవితా రవియై..కవిత్వ గగనాన వెలుగులీను పతాకమై మనలను నిత్యమూ పలుకరిస్తూనే ఉంటారు.



వ్యాసకర్త
ఎం వి ఎస్ శాస్త్రి.

వ్యాస రచయిత : ( ఎం.వి.ఎస్.శాస్త్రి ,
ఒంగోలు 9948409528 )




# లక్ష్మీపురం గ్రామపంచాయతీ భారీ అవినీతికి పాల్పడ్డ

# ఆనాటి జూనియర్ అసిస్టెంట్

## లెక్క పత్రం లేకుండా అవినీతికి పాల్పడ్డ జూనియర్ అసిస్టెంట్

## జూనియర్ అసిస్టెంట్ చేతివాటంపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న అధికారులు

**చల్లపల్లి పెన్ పవర్ మే 29**

పంచాయతీ రాజ్ అధికారులు చల్లపల్లి మండలం లక్ష్మీపురం గ్రామపంచాయతీ కార్యాలయం లో ఆనాటి జూనియర్ అసిస్టెంట్ సాయి సంధ్య చేతివాటాన్ని ప్రదర్శించగా అధికారులు రహస్యముగా విచారణ చేపడుతూ ఆమెను కాపాడే ప్రయత్నం చేస్తున్నట్టు తెలుస్తుంది 2023 2024 2025 హయాంలో పంచాయతీ కార్యాలయంలో జమ చేయవలసిన డబ్బులను జమ చేయకుండా చాపల చెరువుల డబ్బులు తన సొంత అవసరాలకు వినియోగించుకోవడం ఇంటి పన్నుల ల లో భారీ గా లంచాలు తీసుకొని ఒకరి ఇంటి పన్ను మరొకరికి ఇచ్చి అవకతవకలకు పాల్పడింది. అప్పటి హయాంలో ఇన్చార్జి గా ఉన్నటువంటి చల్లపల్లి పంచాయతీ కార్యదర్శి పని ఒత్తిళ్ల వల్ల జూనియర్ అసిస్టెంట్ ముక్కొల్లు సాయి సంధ్య కి బాధ్యతలు అప్పగించగా ఇది అణువుగా భావించి అందిన కాడికి దోచుకొని చార్జి కూడా అప్ప చెప్పకుండా ప్రమోషన్ మీద వేరే జిల్లాకు బదిలీ అవ్వటం చర్చనీయంగా మారింది. చెరువుల పాటలు విద్యుత్ పరికరాలకు కొనుగోలు తో పాటు పారిశుధ్య కార్మికులు ల వేతనాలలో అవినీతికి పాల్పడినట్లు తెలుస్తోంది ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో అధికారి జిల్లా పంచాయతీరాజ్ అధికారి విచారణ చేపట్టగా వాస్తవమని తెలిసి ఆశ్చర్యానికి గురైనట్లు సమాచారం విచారణ తరువాత కొంత మొత్తంలో డబ్బులు కార్యాలయానికి జమ చేయగా ఇంకా కొంత అమౌంట్ జమ చేయవలసి ఉంది జమ చేయవలసిన అమౌంట్ ఏప్పుడు జమ చేస్తారు అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకుంటారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. సంవత్సరాలు గడుస్తున్న ఒక్క అడుగు కూడా విచారణ ముందుకు వెళ్ళట్లేదని విమర్శలు వినిపిస్తున్నాయి రాజకీయ పలుకుబడే ఇందుకు కారణమా లేక పంచాయతీ పాలకవర్గం దాటవేసే దూరాన్ని అవలంబించడం వలన అధికారులు విచారణ ముందుకు సాగటం లేదా అని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి ఇప్పటికైనా జిల్లా పంచాయతీరాజ్ అధికారులు లక్ష్మీపురం గ్రామపంచాయతీ లో జూనియర్ అసిస్టెంట్ చేసిన అవినీతిని బయటపెట్టి వారిపై చర్య తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు దీనిపై జిల్లా పంచాయతీరాజ్ అధికార యంత్రాంగ ఎలా చర్య తీసుకుంటుందో వేచి చూద్దాం.

# పెన్ పవర్


## గుంటూరు। బాపట్ల। పల్నాడు

### ఆరోగ్యమే మహాభాగ్యం, యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని

## జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ప్రజలకు పిలుపునిచ్చారు

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, మచిలీపట్నం, మే, 29**

గురువారం తెల్లవారుజామునే జిల్లా కలెక్టర్ ఏపీ యోగాసభ ఆధ్వర్యంలో నగరంలోని గాంధీనగర్ వాకర్స్ అసోసియేషన్ హాల్లో యోగ గురువు చింతయ్య నేతృత్వంలో ఏర్పాటు చేసిన యోగా శిక్షణ తరగతుల్లో పాల్గొని సూర్య నమస్కారాలు, యోగాసనాలు, ప్రాణాయామాలు చేశారు. జిల్లా కలెక్టర్ ప్రతిరోజు క్రమం తప్పకుండా ఉదయాన్నే యోగా చేస్తూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యోగా ద్వారా మనస్సు, శరీరము ఏకమై ఆరోగ్య సమస్యలు తొలగిపోయి మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రతిరోజు తాను యోగా చేయడం వలన ఎంత ఒత్తిడి ఉన్న సాఫీగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నానన్నారు. వచ్చే జూన్ నెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు వీలుగా ప్రతి ఒక్కరు తమ పేర్లను యోగా యాప్ లో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ యోగ సాధన చేసి ఆరోగ్యంగా ఉండాలని ముఖ్యంగా ఉద్యోగులు ఒత్తిడి లేకుండా విధులు నిర్వహించేందుకు యోగ సాధన ఎంతగానో తోడ్పడుతుందన్నారు ఏపీ యోగ సభ వారు ఎక్కడా లేనివిధంగా మచిలీపట్నంలో ఐదు కేంద్రాల్లో చింతగుంటపాలెం, గొడుగుపేట, శంకరమఠం, గాంధీనగర్, రెడ్ క్రాస్ భవనంలో ఉచితంగా యోగా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారని, ప్రజలందరూ ముఖ్యంగా ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.




## పంట కాల్వల పూడికతీత, మరమ్మతు పనులను వేగంగా పూర్తి చేయాలని

## జల వనరుల శాఖ ఇంజినీర్లను జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి





**పెన్ పవర్ బ్యూరో బాపట్ల మే 29:**

కర్లపాలెం మండలంలో కలెక్టర్ వెంకట మురళి గురువారం విస్తృతంగా పర్యటించారు. రూ.12 లక్షలతో తిమ్మరాజు కాల్వ మరమ్మతు పనులకు జిల్లా కలెక్టర్ భూమి పూజ చేసి ప్రారంభించారు. కాల్వల పూడికతీత పనులను పరిశీలించారు. దమ్మన్న వారిపాలెంలోని చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాన్ని పరిశీలించారు. వ్యవసాయ రంగంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కలెక్టర్ చెప్పారు. రైతుల పక్షపాతి ప్రభుత్వంగా రైతుల వెంట నిలిచిందన్నారు. రైతులకు మేలు చేయడమే లక్ష్యంతో పంట కాల్వల పూడికతీత, మరమ్మతు పనులను చేపట్టిందన్నారు. వ్యవసాయ రంగంపై ఆధారపడిన బాపట్ల జిల్లాలో పంట కాల్వలను ఎప్పటికప్పుడు పూడిక తీత పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆయకట్టు భూములన్నింటికీ సాగునీరు చేరేలా అధికారులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలన్నారు. కాల్వలలో నీరు సజావుగా దిగువ ప్రాంతాలకు వెళ్తే రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ విషయాలను అధికారులు పరిగణనలోకి తీసుకోవాలన్నారు. కృష్ణ పశ్చిమ డెల్టా పరిధిలోని పంటకాల్వల మరమ్మతులకు నిధులు విడుదల చేసిందన్నారు. బాపట్ల జిల్లాలోని కాల్వలపై 454 పనులు గుర్తించి ప్రతిపాదనల పంపగా ప్రభుత్వం రూ.12.59 కోట్ల నిధులను విడుదల చేసిందన్నారు. వాటితో జిల్లా వ్యాప్తంగా మరమ్మతు పనులు మొదలయ్యాయన్నారు. తిమ్మరాజుపాలెం గ్రామానికి వెళ్లే పంట కాలువ 10 కిలోమీటర్ల మేర మరమ్మతు పనులు ప్రారంభం అయ్యాయన్నారు. వర్షాలు రాకమునుపే, చేపట్టిన పనులన్నిటిని పూర్తిచేయాలని జల వనరుల శాఖ ఇంజినీరింగ్ అధికారులకు ఆయన సూచించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ వెంకట మురళి చెప్పారు. భావితరాల కొరకు పర్యావరణాన్ని కాపాడాలని, పర్యావరణ పరిరక్షణతోనే ప్రజల ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. ఆ గ్రామంలో చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. 350 గృహాల నుంచి వెలువడే చెత్తను గ్రామం వెలుపల డంపింగ్ చేయడంపై అధికారులను ప్రశ్నించారు. ఆ గ్రామానికి ఇద్దరు క్లాప్ మిత్రులు ఉండడం ఏమిటని, జనాభా సంఖ్యను బట్టి క్లాప్ మిత్రులను ఏర్పాటు చేసుకోవాలని డిపిఓ కి సూచించారు. ఏ గ్రామంలోనైనా చెత్త దిబ్బలు కనిపించరాదన్నారు. చెత్తను కాల్చివేయడం ద్వారా పర్యావరణానికి హాని కలుగుతుందన్నారు. పరిసరాలలో పరిశుభ్రత లోపిస్తే ప్రజలు రోగాల భారిన పడతారన్నారు. ప్రతి ఇంటి వద్దనే ప్రజలు పొడి చెత్త, తడి చెత్త ను వేరుపరిచేలా అవగాహన కల్పించాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు వేరుగా, ఇనుము వంటి లోహాలు వేరుగా, గాజు పదార్థాలు వేరుగా, భూమిలో కూలిపోయే పదార్థాలను వేరు చేసి చెత్త కుండిలో వేయాలన్నారు. కుళ్లిపోయే పదార్థాలను చెత్త సంపద కేంద్రంలో వేరుపరచి సంపద సృష్టికి సహకరించాలన్నారు. తద్వారా పర్యావరణానికి ఎలాంటి హాని ఉండదనే విషయాలను గ్రామస్తులకు వివరించాలన్నారు. ప్లాస్టిక్ ఉద్గారాలను వేరుచేసి విక్రయించుకునే పద్ధతులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాలలో అధికారులు నిర్లిప్తంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. అధికారులు ఛాలెంజ్ గా పనిచేయాలని సూచించారు. దుకాణాల వద్ద ప్లాస్టిక్ సంచుల వాడకాన్ని నియంత్రించుకోవాలన్నారు. తదుపరి పర్యటనలో అధికారుల పద్ధతి మారకపోతే క్రమశిక్షణ చర్యలు ఉంటాయన్నారు. ఆయన వెంట జలవనరుల శాఖ ఎస్ఈ వెంకటరత్నం, డిపిఓ ప్రభాకర్, బాపట్ల ఇంచార్జి ఆర్డీవో లవన్న, డిఈ జాకిర్, ఎండిఓ ఏ శ్రీనివాసరావు, తహసిల్దార్ సుందరమ్మ, తదితరులు ఉన్నారు.



# నూతన సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలి

## వేకనూరు వికసిత్ కృషి సంకల్ప అభియాన్ సభలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్.!

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, మచిలీపట్నం, మే, 29:**

రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న నూతన సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచించారు. గురువారం అవనిగడ్డ మండలం వేకనూరులో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ సభ జరిగింది. ముఖ్య అతిధిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలపై రైతులకు అవగాహన కలిగించేందుకు ఏర్పాటు చేసిన ఈ సదస్సులు ప్రయోజనకరం అన్నారు. వ్యవసాయంలో సాగు వ్యయం తగ్గించాలనే లక్ష్యంతో ప్రభుత్వం తగిన సహకారం అందిస్తోందన్నారు. యాభై శాతం సబ్సిడీ వ్యవసాయ యంత్ర పరికరాలు అందిస్తోందన్నారు. డ్రోన్ టెక్నాలజీ ద్వారా వ్యవసాయాన్ని సులభతరం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇందుకోసం రైతులకు ప్రభుత్వం రాయితీపై డ్రోన్లు అందిస్తోందన్నారు. రోజురోజుకు పురోగతి సాధిస్తున్న శాస్త్ర సాంకేతిక రంగాల ప్రగతితో రైతులకు మేలు కలుగుతోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రైతులకు పెట్టిన ధాన్యం సొమ్ము బకాయి కూటమి ప్రభుత్వం తీర్చటంతో పాటు, ధాన్యం విక్రయించిన 24గంటల్లో సొమ్ము రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలు సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని, ఔషధ మొక్కలు, ఆయిల్ పామ్ పంటల సాగు విస్తీర్ణం పెరగాలని భారతదేశ మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహారావు ఆకాంక్షించే వారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఆయిల్ పామ్ పంటకు విస్తృత ప్రోత్సాహం అందిస్తోందన్నారు. కృష్ణాడెల్టా ఉద్యమంతో డెల్టా సమస్యలు ప్రభుత్వం గమనించి పులిచింతల ప్రాజెక్టు, పట్టిసీమ ప్రాజెక్టు నిర్మించినా పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతోనే శాశ్వత పరిష్కారం సాధ్యం అన్నారు. కూటమి ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసేందుకు కృత నిశ్చయంతో పని చేస్తోందన్నారు. ఏడాది క్రితం తాను ఎన్నికల్లో గెలిచిన వెంటనే ఇరిగేషన్, డ్రైనేజి శాఖల అధికారులతో చర్చించి నియోజకవర్గంలోని పంట కాలువలు, మురుగు కాలువల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి యుద్ధప్రాతిపదికన తూటికాడ, గుర్రపు డెక్క తొలగించి సాగుకు అనుకూల పరిస్థితి కల్పించినట్లు తెలిపారు. తాజాగా రానున్న సీజనుకు అనుగుణంగా ప్రభుత్వం ద్వారా నిధులు సాధించి పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను సాగు నీటి సంఘాల వారు సద్వినియోగం చేసుకుని రైతులకు మేలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివన్నారాయణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మనోహర్, ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ సుధారాణి, ఎంపీడీవో మరియాదేవి, గ్రామ సర్పంచ్ తుంగల శ్రీలక్ష్మి, ఏడీఏ జయప్రద, ఉద్యానవన శాఖ అధికారి ఎన్.రమేష్, ఏఓ వి.శౌరమ్మ, కేవీకే శాస్త్రవేత్తలు మంజువాణి, రేవతి, పంచాయతీ కార్యదర్శి రోహిత్, వీఏఏ పవన్, టీసీ అధ్యక్షులు భోగాది రాజకుమార్, ఐసీఏఆర్, యూనివర్సిటీ శాస్త్రవేత్తలు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ డ్రోన్ ప్రదర్శన ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే సందర్శించారు. అధికారులు డ్రోన్ ప్రయోజనాలు రైతులకు వివరించారు.

## రేషన్ దుకాణాల్లోనే సరకుల పంపిణీ:

# తాహసిల్దార్ వెంకటేశ్వర్లు నాయక్

**పెన్ పవర్ కారంపూడి 29**

కారంపూడి మండలంలో జూన్ 1 నుంచి రేషన్ దుకాణాల్లో డీలర్ల ద్వారా సరకులు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్ సరకుల పంప వాహనాలను రాష్ట్ర ప్రభుత్వం నిలుపుదల చేసిందన్నారు. 65 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులకు డీలర్ల ద్వారా 5వ తేదీ లోపు ఇళ్ల వద్ద సరకులు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాబట్టి మండల ప్రజలందరూ తమ గ్రామాల్లోని తమ పరిధిలో ఉన్న రేషన్ షాపు వద్దకు వెళ్లి.. రేషన్ తీసుకోవాల్సిందిగా అయన కోరారు. రేషన్ షాప్ యాజమాన్యలు రేషన్ సరిగ్గా ఇవ్వకపోతే.. తాహసిల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయవలసిందిగా అయన కోరారు.



# మైనర్లు వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవు

**ద్విచక్ర వాహనదారులు వాహన పత్రాలు కలిగి ఉండాలి**

**బాపట్ల పట్టణ ఎస్సై చంద్రావతి**






**పెన్ పవర్ బ్యూరో బాపట్ల మే 29:**
వాహనాలపై ఉన్న పెండింగ్ చలానాలను కట్టాలి వాహన పత్రాలు డ్రైవింగ్ లైసెన్స్ లేనివారికి జరిమానా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న మైనర్లకు కౌన్సిలింగ్ బాపట్ల పట్టణం ఆంజనేయస్వామి గుడి వద్ద గురువారం పట్టణ ఎస్సై చంద్రావతి, వాహనాల తనిఖీలు చేశారు. వాహనదారులకు కొన్ని సూచనలను సూచించారు. పట్టణంలో మైనర్లు ఎక్కువగా వాహనాలు నడపడం వల్ల ఎక్కువగా యాక్సిడెంట్ కు కారణం అవుతున్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటాము, వాహన దారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనాన్ని నడపాలని అలాగే డ్రైవింగ్ లైసెన్స్ వాహన పత్రాలు వాహనంలో ఉంచుకోవాలని తెలిపారు. పట్టణంలో కొన్ని వాహన తనిఖీ చేయగా డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి అపరాధ రుసుము విధిస్తూ, మరోసారి డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పట్టణంలో ద్విచక్ర వాహనదారులు ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ పట్టణ పోలీసులకు సహకరించాలని తెలిపారు.

# అకాల వర్షంతో కాలనీవాసులకు తప్పని తిప్పలు





**బెల్లంకొండ పెన్ పవర్ మే 29**
అకాల వర్షంతో కాలనీలోకి వచ్చిన వర్షపు నీరు పోవడంతో ఎస్టీ కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వచ్చిందంటే వారి అవస్థలు వర్ణనాతీతం స్థానిక మండల కేంద్రమైన బెల్లంకొండ పంచాయతీలు వీధుల్లోంచి పారే వర్షం నీరు ఎస్ టి కాలనీ వాసుల ఇండ్ల పరిసర ప్రాంతాలు లోతట్టుగా ఉండటంతో వాట్సాప్ నీరు పారెందుకు వీలు లేకపోవడంతో వర్షం వచ్చినప్పుడల్లా ఆ నీరంతా కాలనీలోని ఇళ్ల మధ్యలో చేరుతుందని కాలనీవాసులు వాపోతున్నారు. దీంతో ఇబ్బంది పడుతున్నామని అంటున్నారు సమస్యను పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లిన ప్రయోజనం లేకుండా పోయిందని వర్షం కురిసినప్పుడల్లా ఇళ్లలోకి నీరు చేరే పరిస్థితి నెలకొంటుందని, గురువారం మధ్యాహ్నం నుండి రెండు గంటలపాటు కురిసిన వర్షంతో యధావిధిగా వర్షపు నీరు ఇళ్ల మధ్యలోకి చేరడంతో మా కాలనీవాసుల వర్షపు నీటితో తీవ్ర ఇబ్బందులు పడుతున్న అవస్థలపై జిల్లా అధికారులు స్పందించి వర్షపు నీరు బయటకు వెళ్లే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఎస్టీ కాలనీవాసులు వాపోతున్నారు.

# రాష్ట్రస్థాయిలో ఫోటోగ్రాఫర్లు వీడియో గ్రాఫర్ల ఫెడరేషన్ ఏర్పాటు చేయాలి.... లంకిశెట్టి బాలాజీ









**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, మచిలీపట్నం, మే, 29:**
ఎంతోకాలంగా పెండింగ్లో ఉన్న రాష్ట్ర ఫోటోగ్రాఫర్లు మరియు వీడియో గ్రాఫర్ల సంక్షేమం కోసం రాష్ట్ర ఫెడరేషన్ వెంటనే ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఫోటోగ్రాఫర్ల సంఘం లీగల్ అడ్వైజర్ లంకిశెట్టి బాలాజీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును డిప్యూటీ సీ.ఎం కె. పవన్ కళ్యాణ్ ను కోరారు. గురువారం మచిలీపట్నం లో జరిగిన ఫోటోగ్రాఫర్లు వీడియో గ్రాఫర్ల మచిలీపట్నం డివిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం కు లంకిశెట్టి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా ఫోటోగ్రాఫర్లు వీడియో గ్రాఫర్లు నూతన టెక్నాలజీని అలవర్చుకోవాలని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో పోలింగ్ సమయంలో కౌంటింగ్ సమయంలో ఫోటోగ్రాఫర్లకు వీడియో గ్రాఫర్లకు ప్రభుత్వ పరంగా పని కేటాయించాలని బాలాజీ కోరారు. దక్షిణ భారతదేశంలో కెమెరా సృష్టికర్త లూయిస్ డాగ్ రే విగ్రహాన్ని ఏర్పాటు చేసిన మచిలీపట్నం ఫోటోగ్రాఫర్ల సంక్షేమ సంఘం ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రభుత్వ పరంగా ఫోటోగ్రాఫర్లకు బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని అర్హులైన వృద్ధ ఫోటోగ్రాఫర్లకు పెన్షన్లు మంజూరు చేయాలని బాలాజీ కోరారు. విజయవాడ సోనీ కెమెరా డిస్ట్రిబ్యూటర్ సాయి రెడ్డి మాట్లాడుతూ ఫోటోగ్రాఫర్ల కోసం తమ సంస్థ తక్కువ ధరలకు రా మెటీరియల్ అందిస్తుందని తెలియజేశారు. మచిలీపట్నం డివిజన్ ఫోటోగ్రాఫర్లు మరియు వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు చిలంకుర్తి శేషు మాట్లాడుతూ మచిలీపట్నంలో జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ఫోటోగ్రాఫర్లు వీడియో గ్రాఫర్లు కోసం సంఘ భవనానికి ఐదు సెంట్లు స్థలం కేటాయించాలని కోరారు. హైదరాబాద్ నుంచి వచ్చిన మెంటార్ అబ్దుల్ ఫరూక్ కెమెరా లోని మెలకువలను తెలియజేశారు. తొలుత కెమెరా సృష్టికర్త లూయిస్ దాగురె చిత్రపటానికి లంకిశెట్టి బాలాజీ పూలమాలవేసి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సమావేశానికి మచిలీపట్నం పెదన చిన్నాపురం ఇతర ప్రాంతాల నుంచి ఫోటోగ్రాఫర్లు వీడియోగ్రాఫర్లు హాజరయ్యారు.

# తిమ్మనపాలెం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

## ప్రమాద బాధితులను కాపాడిన ప్రజానాయకుడు కరణం వెంకటేష్







**చీరాల, పెన్ పవర్, మార్చి 29**
ఒక నాయకుడి గొప్పతనం పదవిలో ఉండడం కాదు,ప్రజల దుర్ఘటనలో ముందుండి నిలవడమే,అధికారం ఉన్న లేకున్నా ప్రజల ఆపద సమయంలో అండగా నిలబడడమే నిజమైన నాయకుడు లక్షణం తండ్రి నుంచి సేవా భావాన్ని పునికి పుచ్చుకున్న కరణం వెంకటేష్ తిమ్మనపాలెం సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మహిళలు రోడ్డుపక్కన రక్తపు మడుగుల్లో బేజారుగా పడి ఉన్న సమయంలో, అదే మార్గంలో ప్రయాణిస్తున్న చీరాల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కరణం వెంకటేష్ బాధితులకు అండగా నిలిచి, మానవత్వానికి ప్రతీకగా నిలిచారు. ఆపదలో ఉన్న వారి వేదనను చూసి ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా, వెంటనే కారును ఆపి, స్వయంగా క్షతగాత్రులను పరిశీలించి, బాధితుల పక్కన నిలబడి తమ చేతులతో సహాయం అందించటం ఆయన మనసులోని మానవతను ప్రతిబింబించింది. తక్షణమే పోలీస్ శాఖ, నేషనల్ హైవే అధికారులకు, అంబులెన్స్ సిబ్బందికి సమాచారం అందించి, గాయపడిన మహిళలను అత్యవసర చికిత్స కోసం హాస్పిటల్కు తరలించే ఏర్పాట్లు చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బాధితులను ఆసుపత్రికి తరలించారు. స్థానిక ప్రజలు సైతం కరణం వెంకటేష్ స్పందనను అభినందిస్తూ, "ప్రజల మధ్య నిలచే ఇలాంటి నాయకులు అధికారంలో ఉంటే భవిష్యత్తు భద్రంగా ఉంటుందంటూ ప్రశంసలు కురిపించారు. ఈ ఘటన అనంతరం క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని కూడా స్వయంగా తెలుసుకుంటానని కరణం వెంకటేష్ అన్నారు.

# ఆరు శాసనాలు ప్రగతికి సోపానాలు..!

**మహానాడును విజయవంతం చేసిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు..!**
**-ఎమ్మెల్యే జూలకంటి మాచర్ల**



**మాచర్ల మే 29 ( పెన్ పవర్ న్యూస్)**
కడప గడ్డపై పసుపు సైన్యం పండుగ మహానాడు వేదికపై ప్రవేశపెట్టిన ఆరు శాసనాలు కార్యకర్తల ప్రగతి సోపానాలు అని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. గురువారం ఓ ప్రకటన ఆయన మాట్లాడుతూ... కడప కేంద్రంగా మూడు రోజులు పాటు అంగరంగ వైభవంగా నిర్వహించిన మహానాడు ఎంతో అద్భుతంగా జరిగిందని ఆయన పేర్కొన్నారు. లక్షలాదిగా తరలివచ్చిన కార్యకర్తలకు, నాయకులకు, ప్రజా ప్రతినిధులకు ఎటువంటి లోటు లేకుండా అన్నీ ఏర్పాట్లు బ్రహ్మాండంగా చేశారని హర్షం వ్యక్తం చేశారు. కార్యకర్తల సంక్షేమం కోసం అహర్నిశలు పాటుపడే పార్టీ తెలుగుదేశం పార్టీ అని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధికి పార్టీ అధినేత, ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్వర్ణాంధ్రప్రదేశ్ – 2047 కు పిలుపునివ్వగా.., ఆయన సంకల్పం సఫలీకృతం అయ్యేందుకు పార్టీ ప్రధాన కార్యదర్శి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కార్యకర్తల అభ్యున్నతికీ ఆరు శాసనాలను ప్రవేశపెట్టారని వివరించారు. మాచర్ల నియోజకవర్గం నుంచి కడప మహానాడుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి..,కార్యక్రమాలను విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే జూలకంటి కృతజ్ఞతలు తెలియజేశారు.

# జాతీయ అధ్యక్షులుగా ఎన్నికైన మన ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్నాను

**తెలుగుదేశం పార్టీ జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి రాచకొండ లక్ష్మయ్య ..**



**పెన్ పవర్ గుంటూరు ఇంచార్జ్**
మాకు దైవ స్వరూపమైన తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులుగా ఎన్నికైన నిరంతర శ్రామికుడు ప్రజల మనిషి, ప్రజల ఆదరణ పొందిన నాయకుడు మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి హృదయపూర్వక శుభాకాంక్షలు,తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడిగా మరోసారి ముఖ్యమంత్రి చంద్రబాబుఎన్నిక.మహానాడు వేదికగా ప్రకటించిన టీడీపీ నేతలు. 30 ఏళ్ల నుంచి తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగాచంద్రబాబు.1995లో మొదటిసారి పార్టీ పగ్గాలు చేపట్టిన మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.ప్రతి రెండేళ్లకోసారి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడి ఎన్నికైన తెలుగుదేశం పార్టీని తమ భుజాలపై మోస్తూ పార్టీలో ఉన్న అన్ని సామాజిక వర్గాలకు సముచిత స్థానాలు కల్పిస్తూ అభివృద్ధే లక్ష్యంగా, సంక్షేమమే ధ్యేయంగా అహర్నిశల శ్రమిస్తూ తెలుగువారికి అండగా ఉన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా ఎప్పటి కప్పుడు కాపాడుకుంటూ పేదరికం లేని సమాజాన్ని నిర్మించడం కోసం పడుతున్న శ్రమను మరువలేనిది.మరోసారి కడప మహానాడు వేదిక గా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు శుభాకాంక్షలు తెలియజేస్తూన్నాను జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి లక్ష్మయ్య అన్నారు.

# దామిశెట్టి కుటుంబ సభ్యులను పరామర్శించిన.. నేదురుమల్లి



**కావలి పెన్ పవర్ – మే 29**
వైఎస్ఆర్సిపి స్టేట్ ఇంటలెక్చువల్ ఫోరం జనరల్ సెక్రెటరీ దామిశెట్టి సుధీర్ నాయుడు తండ్రి దామిశెట్టి శ్రీనివాస నాయుడు ఇటీవల పరమపదించడంతో వారి కుటుంబ సభ్యుల్ని గురువారం కావలి పట్టణంలోని వారి నివాసంలో నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాస నాయుడితో తన తండ్రికి ఉన్న అనుబంధాన్ని రాంకుమార్ రేడ్డి గుర్తు చేసుకున్నారు. దామిశెట్టి శ్రీనివాస నాయుడు డి.బి.యస్ ఇంజనీరింగ్ కళాశాల స్థాపించి విద్యా రంగానికి ఎన్నో సేవలు చేశారని. అలానే రాజకీయంగా అనేక ఉన్నత పదవులు అధిరోహించి ఆ పదవులకే గౌరవాన్ని తెచ్చిన వ్యక్తి అని కొనియాడారు. దామిశెట్టి సుధీర్ నాయుడు కుటంబసభ్యులకు భగవంతుడు ధైర్యాన్ని ఇవ్వాలని ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# కొమరోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సద్గుణ రావు

కళాశాల అభివృద్ధికి విద్యాభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా కృషి.

కళాశాలలో విద్యార్థుల సంఖ్యను ఘననీయంగా పెంచేందుకు చర్యలు.

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలలో మండల స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు అభినందనలు.

పెన్ పవర్ ప్రతినిధితో నూతన ప్రిన్సిపాల్ సద్గుణ రావు.









**కొమరోలు పెన్ పవర్ మే 29**

కొమరోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గా పీకా. సద్గుణ రావు ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గత ఏడాది వరకు కొమరోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ గా పనిచేసిన నంద్యాల శ్రీనివాసులు గత ఏడాది పదవి విరమణ చేశారు. అప్పటినుంచి ఆ కళాశాలకు ప్రిన్సిపాల్ గా ఆ కళాశాల అధ్యాపకులు పనిచేస్తున్న ప్రభాకర్ కళాశాలకు ఎఫ్ఎసి ప్రిన్సిపాల్ గా పనిచేశారు. అయితే కొమరోలు ప్రభుత్వ కళాశాల లో ఖాళీగా ఉంటున్న ప్రిన్సిపాల్ పోస్టు ను భర్తీ చేశారు. మద్దిపాడు లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హిస్టరీ లెక్చరర్ గా పనిచేస్తున్న సద్గుణరావుకు ప్రిన్సిపాల్ గా పదోన్నతి కల్పించి కొమరోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గా నియమించారు. ఆ మేరకు ఆయన ఈనెల 13వ తేదీన ప్రిన్సిపాల్ గా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు .ఆ సందర్భాన్ని పురస్కరించుకొని పెన్ పవర్ ప్రతినిధి నూతన ప్రిన్సిపాల్ కు శుభాకాంక్షలు తెలుపుతూ, ఆయన తో కొద్దిసేపు కళాశాల పరిస్థితులపై చర్చించారు. అనంతరం నూతన ప్రిన్సిపాల్ సద్గుణ రావు మాట్లాడుతూ ,కళాశాలలో ఇద్దరు రెగ్యులర్ లెక్చరర్లు ,ఆరు మంది కాంట్రాక్ట్ లెక్చరలతోపాటు, మరో ఇద్దరు గెస్ట్ ఫ్యాకల్టీ లెక్చరర్లుగా పనిచేస్తున్నారన్నారు. కళాశాలలో అధ్యాపకుల దొరకలేదని, అయితే లైబ్రేరియన్ పోస్టు ఖాళీగా ఉంటున్నాదని తెలిపారు. ఈ ఏడాది ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలలో తమ కళాశాలకు మొదటి సంవత్సరం కోర్సులో 50% ఉత్తీర్ణత లభించగా, ద్వితీయ సంవత్సరం కోర్సులో 80% ఉత్తీర్ణత లభించిందని తెలిపారు. ఫస్ట్ ఇయర్ ఫలితాలలో తమ కళాశాలకు చెందిన కె. భూ వర్షిని ఎంపీసీ ఇంగ్లీష్ మీడియం గ్రూపులో 470 మార్కులకు 453 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించిందని తెలిపారు. అలాగే కే .తబిత సెకండ్ ఇయర్ బైపిసి తెలుగు మీడియం గ్రూపులో 1000 మార్కులకు 949 మార్కులు సాధించి కళాశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు సాధించి పెట్టారని అంటూ ,భూ వర్షిని తబిత లతో పాటు ఫస్ట్ ఇయర్ సెకండ్ ఇయర్ పరీక్షలలో ఉత్తీర్ణులైన విద్యార్థులందరిని ఆయన అభినందించారు. అయితే తమ కళాశాల నుంచి పరీక్షలకు హాజరైన విద్యార్థులు గ్రూపు సబ్జెక్టులలో దాదాపు నూరు శాతం ఉత్తీర్ణత లభించిందని లాంగ్వేజి సబ్జెక్టులలో కొందరు ఫెయిల్ కావడంతో కళాశాలకు ఉత్తీర్ణత శాతం తగ్గిందని ఆయన తెలిపారు. ప్రస్తుతం కళాశాలలో ద్వితీయ సంవత్సరంలో 84 మంది విద్యార్థులు ఉన్నారని ,అయితే మొదటి సంవత్సరం కోర్సులలో వంద మంది విద్యార్థులను చేర్చుకునేందుకు కృషి చేస్తున్నట్లుగా ఆయన చెప్పారు. అందుకు అనుగుణంగా తమ కళాశాల అధ్యాపకులు సిబ్బందితో క్యాంపెనింగ్ నిర్వహిస్తున్నట్లుగా ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. తమ కళాశాల అధ్యాపకులు ,సిబ్బంది విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామ పెద్దలు ,దాతలు, విద్యావేత్తల సహాయ సహకారాలతో కళాశాలను మరింత అభివృద్ధి పథంలో నడిపేందుకు ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తున్నట్లుగా ప్రిన్సిపల్ సద్గుణ రావు పేర్కొన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణ ,నైతిక విలువలతో కూడిన నాణ్యమైన బోధన, ప్రభుత్వ మెనూ ప్రకారం డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం అందించేందుకు కృషి చేస్తానని ప్రిన్సిపాల్ తెలిపారు. ఆ కార్యక్రమంలో ఆ పాఠశాల అధ్యాపకుడు బోధ నేతల సిబ్బంది పాల్గొన్నారు.

## మహానాడులో పాల్గొన్న పొదిలి దేశం నాయకులు



**పొదిలి, పెన్ పవర్, మే 29**

తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా కడపలో నిర్వహించిన మూడు రోజుల మహానాడు కార్యక్రమంలో పొదిలి మండల దేశం పార్టీ నాయకులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు అలాగే అక్కడ జరిగే పార్టీ సమావేశంలో పాల్గొని పార్టీ పట్ల తమ అభిమానాన్ని చాటుకున్నారు మహానాడు చివరి రోజు అయిన గురువారం నాడు పాల్గొన్న వారిలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మీగడ ఓబుల్ రెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షులు పోపూరి నరేష్ బాబు, రావిపాటి అశోక్, గిద్దలూరి శ్రీకాంత్, కాటూరి వెంకట్రావు, కాటూరి అంజి తదితరులు ఉన్నారు.

## సీఎం చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపిన బెజవాడ



**కందుకూరు పెన్ పవర్, మే 29**

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ జాతీయ అధ్యక్షుడిగా చంద్రబాబు నాయుడు ఎన్నికైనట్టు ఎన్నికల కమిటీ చైర్మన్ వర్ల రామయ్య మహానాడు వేదికగా ప్రకటించడం పట్ల బెజవాడ ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు, ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని ప్రసాద్ మహానాడు వేదిక పై కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ 30 సంవత్సరాల నుండి తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా చంద్రబాబునాయుడు కొనసాగుతున్నారన్నారు. స్వర్గీయ ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా పార్టీని దిగ్విజయంగా ముందుకుతీసుకెళ్తున్నారనీ, పార్టీని బలోపేతం చేయడంతోపాటు కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ పార్టీని ముందుండి నడిపించే నాయకుడు చంద్రబాబు నాయుడు మరోసారి జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నామన్నారు.

## మహానాడు విజయవంతం పై ఎమ్మెల్యే ఇంటూరి హర్షం

**కందుకూరు పెన్ పవర్, మే 29**

దేవుని గడప కడపలో తెలుగుదేశం పార్టీ మహానాడుకు తరలివచ్చి కనీవినీ ఎరుగని విధంగా విజయవంతం చేసిన పసుపు సైనికులు, కార్యకర్తలకు కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. దార్శనిక నేత నారా చంద్రబాబు నాయుడు పై నమ్మకం, భావి తరపు నాయకుడు నారా లోకేష్ పై ఉన్న విశ్వాసం ప్రతి ఒక్కరి ముఖంలో స్పష్టంగా కనిపించింది అని అన్నారు. తెలుగుదేశం పార్టీకి నిజమైన బలంగా నిలిచి మహానాడును విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ఇంటూరి నాగేశ్వరరావు అభినందనలు తెలిపారు. మహానాడు మహా సంబరాన్ని ఎటువంటి ఆటంకాలు లేకుండా, కార్యకర్తలకు అసౌకర్యం కలుగకుండా నిర్వహించిన పార్టీ యంత్రాంగానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.



## పాఠశాలలకు పాఠ పుస్తకాలు, నోటు పుస్తకాలు సరఫరా ప్రారంభం

**రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీ రామారావు జయంతి నీ పురస్కరించుకొని పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు నోటు పుస్తకాలు సరఫరా.**

**ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠ్యపుస్తకాలను సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చాలి.**

**కొమరోలు ఎంఈఓ 2 బొర్రా వెంకటరత్నం.**



**కొమరోలు పెన్ పవర్ మే 29**

రాష్ట్ర ప్రభుత్వం కొమరోలు మండలానికి సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలు ,నోటు పుస్తకాలు, బెల్టులు తదితర వాటిని పాఠశాలలకు సరఫరా చేసే కార్యక్రమాన్ని ప్రారంభించామని కొమరోలు ఎంఈఓ 2 బొర్రా వెంకటరత్నం తెలిపారు. కొమరోలు మండలంలో 44 ప్రాథమిక పాఠశాలలు, మూడు ప్రాథమికోన్నత పాఠశాలలు, నాలుగు జిల్లా పరిషత్ హై స్కూల్స్, ఒక ప్రభుత్వ హైస్కూలు, మరొక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం పనిచేస్తున్నాయని ఆయన తెలిపారు. వాటిల్లో ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు చదువుతున్న బాల బాలికలకు అన్ని సబ్జెక్టులకు చెందిన పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసేందుకు కొమరోలు మండలానికి 18 ,671 పాఠ్య పుస్తకాలు సరఫరా అయ్యాయని, వాటితో పాటు 8,502 వైట్ లాంగ్ నోట్స్ లు 9,385 రూల్డ్ లాంగ్ నోట్స్ లు, 2,066 బ్రాడ్ రూల్స్ నోట్స్ లు, 1,183 గ్రాఫ్స్ నోట్స్ లు మొత్తం 21,126 నోటు పుస్తకాలు సరఫరా అయ్యాయని ఆయన తెలిపారు. వాటితో పాటు బాలురకు సంబంధించి 2,098 బెల్ట్ లు కూడా సరఫరా అయ్యాయని చెప్పారు. వాటిని కొమరోలు లోని ప్రభుత్వ హైస్కూల్లో భద్రపరిచామన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి అత్తోటి కిరణ్ కుమార్ ఆదేశాల మేరకు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీ రామారావు జయంతిని పురస్కరించుకొని ఈనెల 28వ తేదీ నుంచి పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలను, బెల్టులను మండలంలోని పాఠశాలలకు పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ఆ సందర్భంగా కొమరోలు లోని ప్రభుత్వ హైస్కూల్ కు సంబంధించిన పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు బెల్టులను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివనాగేశ్వరరావుకు అందజేశారు. ఆ కార్యక్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ పసుపులేటి వెంకటేశ్వర్లు, డేటా ఆపరేటర్ రవీంద్రా రెడ్డి, సిఆర్పిలు రామాంజి, పుల్లయ్య ,ఆదినారాయణ, ఆంజనేయులు, పలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మహానాడులో ఉమ్మడి ప్రకాశం నేతలు: కడప గడ్డపై తెలుగుదేశం పార్టీ పండుగ మహానాడు బహిరంగ సభ వేదిక వద్ద ఉమ్మడి ప్రకాశం జిల్లా టీడీపీ ప్రజాప్రతినిధులు..నేతలు.

## మణిపాల్ రెడ్డి మాస్టారు ఇకలేరు



**కందుకూరు పెన్ పవర్, మే 29**

కందుకూరులో ఉత్తమ ఇంగ్లీష్ లెక్చరర్ గా ప్రశంసలు అందుకున్న మణిపాల్ రెడ్డి(63) గురువారం ఉదయం కన్నుమూశారు. తీవ్ర అనారోగ్య సమస్యతో ఆయన కొంతకాలంగా బాధపడుతున్నారు. ఇటీవల చెన్నైలోని ఓ హాస్పిటల్ కు వెళినా ఫలితం లేకపోయింది. 40 ఏళ్లకు పైగా విద్యా బోధనలో విశేష సేవలందించిన మణిపాల్ రెడ్డి మృతి వార్త ఆయన అభిమానులను వేదనకు గురిచేసింది. మణిపాల్ రెడ్డి శిష్యులు అనేకమంది మంచి ఉన్నత స్థానంలో ఉన్నారు. వారందరూ వివిధ మాధ్యమాల ద్వారా సంతాపాన్ని తెలియజేశారు. తుది శ్వాస విడిచే వరకు విద్యాబోధన చేస్తూనే ఉత్తమ ఉపాధ్యాయుడిగా విద్యార్థుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు.కళాశాలల యాజమాన్యాలు, సిబ్బంది సంతాపం తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలి

**ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సత్యనారాయణ**

**పొదిలి, పెన్ పవర్, మే 29**

ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జి సత్యనారాయణ ఆదేశించారు గురువారం రాత్రి ఆయన స్థానిక ఆర్టీసీ డిపో ను ఆకస్మిక తనిఖీ జరిపారు ఈ సందర్భంగా డిపోలో ఉన్న కార్గో సేవల గురించి విచారించారు అదేవిధంగా బస్ స్టేషన్ లో పర్యటించి అక్కడ ఉన్న వివిధ దుకాణాలను పరిశీలించారు అనంతరం డిపో గ్యారేజ్ లోని మెకానిక్ లతో మాట్లాడి వారి ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు అలాగే గ్యారేజీ సిబ్బందికి అవసరమైన సలహాలు సూచనలు అందించారు రీజనల్ మేనేజర్ సత్యనారాయణ వెంట డిపో మేనేజర్ శంకర్రావు, సూపరింటెండెంట్ ఫణి కుమార్ తదితరులు ఉన్నారు.



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com

# ఉపాధి పనులను తనిఖీ

**ఫీల్డ్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం ను అభినందించిన.. ఏపీవో**

**కావలి రూరల్ - పెన్ పవర్- మే 29**

కావలి రూరల్ మండల పరిధిలోని సిరిపురం పంచాయతీలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతున్న రెండు కాలువల పనులను గురువారం మండల ఏపీవో వి చెంచయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పని ప్రదేశంలో కూలీల హాజరు, మస్టర్ రోల్, నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలు కొలతలను అనుగుణంగా పనిచేసిన వారికి రోజుకి 307 రూపాయలు కూలి వేతనం పొందాలని సూచించారు. వక్క కుటుంబానికి వంద రోజులు పని కల్పించడం ద్వారా వారికి 30 వేల 70 రూపాయలు వస్తుందని కాబట్టి ప్రతి కుటుంబం కచ్చితంగా వంద రోజులు పని




చేసుకోవాలని తెలిపారు. అనంతరం కూలీలతో మాట్లాడి వారి సౌకర్యాలపై ఆరా తీశారు. పనుల నాణ్యత మెరుగుపరచడంలో కూలీలకు సౌకర్యాలు కల్పించడంలో ఫీల్డ్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం చేస్తున్న సేవలను గుర్తించి ఏపీవో ఆయన్ని ప్రత్యేకంగా అభినందించారు.

పెన్ పవర్
నెల్లూరు | తిరుపతి | చిత్తూరు

# మహానాడులో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మార్క్

**ఎమ్మెల్యే పిలుపుతో కదలిన సుమారు 20వేల మంది టిడిపి శ్రేణులు.**

**200 బస్సులు, ప్రతి మండలం నుండి 200 కార్లతో కోలాహలంగా మహానాడుకు తరలిన పసుపు సైన్యం.**

**మహానాడులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఉదయగిరి టిడిపి నేతల భారీ కటౌట్స్ ఫ్లెక్సీలు.**





**ఉదయగిరి పెన్ పవర్ - మే 29**

తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా కడప గడపలో చేపట్టిన మహానాడులో ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ మార్క్ ప్రత్యేకంగా నిలిచింది. జాతీయ తెలుగుదేశం పార్టీ పిలుపు మేరకు ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ ఉదయగిరి నియోజకవర్గం టిడిపి నేతలు నాయకులు కార్యకర్తలు అభిమానులకు మహానాడు ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే పిలుపుతో, ఉదయగిరి కొండంత అభిమానాన్ని చాటుతూ, పసుపు సైన్యం సుమారు 200 బస్సులు, ప్రతి మండలం నుండి 200 కార్లలో సుమారు 20వేల మంది మహానాడు భారీ బహిరంగ సభకు తరలి వెళ్లారు. ఎనిమిది మండలాల మండల కన్వీనర్లు, ముఖ్య నేతల ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువ నేత మంత్రి నారా లోకేష్ బాబు, ఎమ్మెల్యే సురేష్, నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు, తెలుగుదేశం జిందాబాద్ అంటూ ఉదయగిరి హోరెత్తింది. ముందస్తు ప్రణాళికతో



ఎమ్మెల్యే కార్యకర్తలకి అభిమానులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మహానాడు వద్ద భోజనం వసతి ఉన్నప్పటికీ, పి పి కుంట బద్వేల్ కి మధ్యలో హైవేకి పక్కన ఒక ప్రదేశంలో ప్రతి ఒక్కరికి ఆహార ప్యాకెట్లు మంచినీరు, మజ్జిగ, అందజేస్తున్నారు. మహానాడుకు వెళ్లే క్రమంలోనే కాకుండా తిరిగి వచ్చేటప్పుడు కూడా అందరికీ ఆహారం, మంచినీరు, మజ్జిగ, అందించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లును చేసి శభాష్ సురేష్ అనిపిస్తున్నారు. అంతేకాకుండా సురేష్ అన్న పిలుపుతో కదిలిన పసుపుదళం మహానాడు జరిగే ప్రాంగణంలో భారీ ఎత్తున కటౌట్స్, ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి, జాతీయస్థాయిలో ప్రత్యేక ఆకర్షణగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ నిలిచారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి ఇప్పటివరకు ఇంత పెద్ద ఎత్తున మహానాడు పండుగ ఉదయగిరి నియోజకవర్గం లో జరగలేదని, ఒక్క పిలుపుతో కదలిన పసుపు సైన్యాన్ని చూసి సీనియర్ సిటిజెన్ల సైతం ముక్కున వేలేసుకుంటున్నారు. ఒక్క పిలుపుతో భారీ ఎత్తున తరలివచ్చిన నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్తకు నాయకులకు, టిడిపి నేతలకు, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఘనంగా కామ్రేడ్ జక్కా వెంకయ్య

# 7వ వర్ధంతి వేడుకలు

**వెంకన్న చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించిన నాయకులు**



**కావలి పెన్ పవర్ - మే 29**

అమరజీవి కామ్రేడ్ జక్కా వెంకయ్య 7వ వర్ధంతి సందర్భంగా స్థానిక శివరామ సుబ్బయ్య భవనం సిపిఎం పార్టీ కార్యాలయంలో గురువారం సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు వి మల్లికార్జున్ రావు, ఎస్ వెంకయ్య, జక్కా వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ నెల్లూరు జిల్లా మార్క్సిస్టు పార్టీ నిర్మాత బడుగు ,బలహీన, వర్గాల ఆశాజ్యోతి, ఎంతోమంది పేదలకు భూములు పంచి, ఇళ్ల నిర్మాణాలు చేపట్టి పేదల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచిన మహానీయుడు జక్కా వెంకన్న లేని లోటు పేద ప్రజలకు మార్క్సిస్టు పార్టీకి తీరని లోటని అన్నారు. దామరమడుగు గ్రామంలో జన్మించి మార్క్సిస్టు పార్టీ నిర్మాణం కొరకు వ్యవసాయ కార్మిక సంఘం పెట్టి వ్యవసాయ కూలీల కొరకు ఎంతో కృషి చేశారని అన్నారు. అంతేకాకుండా రెండుసార్లు అల్లూరు శాసనసభ్యునిగా గెలిచి ప్రజా సమస్యలపై అసెంబ్లీలో తన గళాన్ని వినిపించేవాడని సమస్యల పరిష్కారం కొరకు ప్రజా ఆందోళన చేపట్టి జిల్లా ప్రజలకు త్రాగునీరు ,సాగునీటి కొరకు ఎంతో కృషి చేశారని అన్నారు. మార్క్సిస్టు పార్టీ ని ముందుకు తీసుకుపోవడమే వెంకన్న ఆశయమని అందుకు ప్రజా పోరాటాలను ముందుకు నడపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు ఎస్ వెంకయ్య, బి కిష్టయ్య, మేడ వెంకటేశ్వర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సింధూర మానస్వి కి చిరు బహుమతి అందజేసిన డాక్టర్ దార శ్రీనివాసులు

**కావలి పెన్ పవర్- మే 29**

కావలి పట్టణంలోని ఇందిరానగర్ 22వ వార్డుకు చెందిన కాకాని దర్గా బాబు వృత్తి రీత్య పెయింటర్ తన కుమార్తె కాకాని సింధూర మానస్వి పదో తరగతిలో 580/600 సాధించిన సందర్భంగా ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్పోక్స్ పర్సన్ మరియు భారతీయ జనతా పార్టీ మాజీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు. స్వేరోస్ ఎంప్లాయిస్ మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి. డాక్టర్. దారా. శ్రీనివాసులు సింధూర మానస్వి ఆశీర్వదిస్తూ చిరు బహుమతిని గురువారం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికంలో పుట్టినప్పటికీ చదువుకు పేదరికం అడ్డు కాదు అని చదివే ఉన్నత మార్గానికి సోఫానమని తల్లిదండ్రుల కష్టాన్ని వృధా చేయకుండా కష్టపడి చదివి 580 మార్కులు తెచ్చుకున్న సింధూర మానస్విని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని అన్నారు. ఇది మనకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇచ్చిన ఒక వరం అని గుర్తుంచుకుంటూ భవిష్యత్తులో సింధూర మానస్విని డాక్టర్ చదవాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు.



## పసుపు పండగకి తరలిన

# తెలుగు తమ్ముళ్లు

**భారీగా తరలిన జన సమూహం విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు.... చింతల శీను**





**సీతారాంపురం పెన్ పవర్-మే29**

మన ప్రియతమ నాయకులు ఉదయగిరి శాసనసభ్యులు శ్రీ కాకర్ల సురేష్ సారధ్యంలో మహానాడు మూడవరోజు నాటి బహిరంగ సభకు భారీగా సీతారాంపురం మండలం నుంచి బయలుదేరి వెళ్లారు. సీతారాంపురం మండలం నుంచి చింతల శీను ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.. కడప జిల్లాలో తెలుగుదేశం పార్టీ అధిష్టానం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహానాడు భారీ బహిరంగ సభకు సీతారాంపురం టిడిపి నాయకులు బస్సులు కార్లలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని టిడిపి శ్రేణులు జెండా ఊపి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు తెలుగుదేశం జిందాబాద్. ఎన్టీఆర్ అమర్ రహే. జై కాకర్ల అంటూ నినాదాలతో హోరెత్తించారు. సీతారాంపురం నుండి బయలుదేరిన నాయకులు ఉదయగిరి మీదుగా వెళ్లి కుంట దగ్గర మన ప్రియతమ నాయకుడు కాకర్ల సురేష్ ఏర్పాటుచేసిన భోజనాలు తీసుకొని మహానాడు



కార్యక్రమానికి వెళ్లారు. నియోజకవర్గానికి మొత్తానికి భోజన సదుపాయం చేసినటువంటి కాకర్ల సురేష్ ని టిడిపి శ్రేణులు జై కాకర్ల అంటూ నినాదాలతో మారుమోగిపోయింది. కాకర్ల సురేష్ వంటి నాయకులు ఉండడం వల్ల పార్టీ ఎంతో బలపడింది అన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్ రాజు. కోఆర్డినేటర్ చింతల శ్రీనివాసులు. చెన్నకేశవులు. వెంగళ శెట్టి వెంకటేశ్వర్లు. సోమన్న బోయిన రాజశేఖర్. పిడుగు రమేష్. ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి జాషువా. మరియు తెలుగు దేశం యువ నాయకుడు పసుపులేటి వికాస్ బాబు. తోట ఏడుకొండలు. నాగేష్ యాదవ్. చంద్రారెడ్డి. మాజీజెడ్పిటిసి కలి వేల జ్యోతి. దేవర వెంకటేశ్వర్లు. మహా లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.